
గోవిందా.. గోవింద!

● రమణీయంగా వెలుగొండ వేంకటేశ్వరుడి రథోత్సవం

కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉత్సవమూర్తులకు పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ వెలుగొండ పురవీధుల్లో వేంకటేశ్వరుడి ఊరేగింపు వైభవంగా సాగింది. 'ఏడుకొండలవాడా.. వెంకటరమణా.. గోవిందా గోవింద' నినాదాలతో భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. - కొనకనమిట్ల, ఆంధ్రజ్యోతి



పదిలో ఇన్విజిలేటర్ల జంబ్లింగ్

● 1,300 మందికి కేంద్రాల మార్పు ● నేటి నుంచి అమలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఒంగోలు విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు నియమితులైన ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ చేశారు. పరీక్షలు ప్రారంభమైన ఈనెల 17 నుంచి ఒకే కేంద్రంలో పనిచేసిన వారిని మరో చోటుకు మార్చారు. ఇలా సుమారు 1,300 మందికి స్థానచలనం కల్పించారు. సోమవారం నుంచి వారు కొత్తగా కేటాయించిన కేంద్రంలో విధులు నిర్వహించనున్నారు.

పదో తరగతి పరీక్షల కోసం అధికారులు జిల్లాలో 183 కేంద్రాలను ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 1,602 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కాపీయింగ్‌కు కళ్లెం వేసేందుకు ప్రతి మూడు పరీక్షలకు ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ చేయాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అందుకు అనుగుణంగా 37 మినహా మిగిలిన 146 కేంద్రాల్లో పనిచేస్తున్న సుమారు 1,300 మంది ఇన్విజిలేటర్లను స్థానికంగా ఉండే మరో సెంటర్‌కు స్థానచలనం కల్పించారు. 37 సెంటర్లలోని ఇన్విజిలేటర్లు మాత్రం పరీక్షలు పూర్తయ్యే వరకు అక్కడే పనిచేస్తారు. జంబ్లింగ్ అయిన వారు కొత్త కేంద్రాల్లో విధుల కోసం ఆదివారం రిపోర్టు చేశారు.

ప్రగతే పరమావధిగా..

వార్షిక లక్ష్యాలు.. అభివృద్ధి అంశాలు

రేపు, ఎల్లుండి అమరావతిలో కలెక్టర్ల సదస్సు

- విజన్-2029పై ఫోకస్
- నివేదికలతో సిద్ధమైన అన్సారియా
- శాశ్వత అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు కోరే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న సదస్సుకు నివేదికలతో హాజరయ్యేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సిద్ధమయ్యారు. జిల్లాలో విజన్-2029 లక్ష్య సాధనకు అనుగుణంగా రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఆయా రంగాల వారీ లక్ష్యాలు, అందుకోసం తీసుకోనున్న చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. శాశ్వత అభివృద్ధి, తక్షణ సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను కూడా కోరనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అజెండాపై వివిధ శాఖల అధికారులతో వారం రోజులుగా సమీక్షలు నిర్వహించిన కలెక్టర్.. పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆ మేరకు నివేదికలను రూపొందించారు.



ఒంగోలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చాక మూడు మాసాలకు ఒకసారి కలెక్టర్ల సదస్సులను నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు రోజుల సదస్సులో పాల్గొని దిశానిర్దేశం చేస్తుండటంతో ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. రేపు, ఎల్లుండి అమరావతిలో ఈ సదస్సులో రానున్న మూడు నెలల లక్ష్యాలపై సమీక్ష ఉంటుందని తొలుత చెప్పారు. అనంతరం వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మొత్తం లక్ష్యాలు, వాటి సాధనకు తీసుకోనున్న చర్యలపై నివేదికలు అడిగారు. తదనుగుణంగా కలెక్టర్ అన్సారియా నివేదికలను సిద్ధం చేసినట్లు సమాచారం.

వీటి కోసం నిధులు కోరే అవకాశం

శాశ్వత అభివృద్ధి పనుల్లో ట్రిపుల్ ఐటీ, ఆంధ్రకేసరి యూనివర్సిటీ నిర్మాణాలు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, వెలిగొండ నిర్వాసితుల తరలింపునకు అవసరమైన నిధులను కలెక్టర్ కోరనున్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య అధిగమించడంతోపాటు రానున్న సీజన్‌లోపు సాగర్ కాలువల్లో సక్రమంగా నీటిపారుదల కోసం చేయాల్సిన అత్యవసర పనులను ఈ సదస్సు సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

తలసరి ఆదాయం 16.18శాతం వృద్ధి లక్ష్యం

ప్రభుత్వం రూపొందించిన విజన్-2029 ప్రణాళికలో పొందుపర్చిన లక్ష్యాలలో 2025-26లో ఏయే రంగాలలో ఎలా ముందుకు వెళ్లాలన్నది కలెక్టర్ అన్సారియా నివేదించనున్నారు. ప్రధానంగా వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేశారు. ఆ మూడు రంగాల ద్వారా జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.65,543 కోట్ల స్థూల ఉత్పత్తి, తద్వారా తలసరి ఆదాయం రూ.2,36,741 ఉంటుందని అంచనా వేశారు. ఆ ప్రకారం ప్రస్తుత ఏడాది స్థూల ఉత్పత్తి 16.48శాతం, తలసరి ఆదాయం 16.18శాతం వృద్ధిగా చూపారు. వ్యవసాయం, అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, అటవీశాఖల వారీ తీసుకోనున్న చర్యలపై సమగ్ర నివేదికను రూపొందించారు. పారిశ్రామిక రంగంలో జిల్లాలో ప్రధానంగా మైనింగ్, నిర్మాణ, పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ, సేవారంగాలకు సంబంధించిన లక్ష్యాలను కూడా నివేదికల్లో పొందుపర్చారు.



పోలీస్‌స్టేషన్ వద్ద వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, వైసీపీ శ్రేణులు

వైసీపీ దౌర్జన్యం

- త్రిపురాంతకం ఎంపీటీసీ-1 కుటుంబంపై మాజీ ఎంపీపీ రుబాబు
- హైదరాబాద్ వెళ్తున్న వారిని మరో ఎంపీటీసీతో కలిసి అటకాయింపు
- అనంతరం కారులో వెంబడించి భయపెట్టే యత్నం
- ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో బరితెగింపు
- బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై అట్రాసిటీ కేసు... అరెస్టు
- పోలీస్‌స్టేషన్ వద్ద ఎర్రగొండపాలెం, దర్శి ఎమ్మెల్యేల ఆందోళన

మార్కాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో ఆదివారం చోటుచేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈనెల 27న జరగనున్న ఈ ఎన్నిక కోసం హైదరాబాద్‌లో ఉంటున్న ఓ ఎంపీటీసీ సభ్యురాలిని తీసుకు వచ్చేందుకు వాహనంలో బయల్దేరిన ఆమె కుటుంబసభ్యులను వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, మరికొందరు అటకాయించారు. అనంతరం వారిని కారులో వెంబడించారు. సమాచారం తెలుసుకున్న ఎర్రగొండపాలెం పోలీసులు మాజీ ఎంపీపీతోపాటు ఆయన వెంట ఉన్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై చౌడయ్య కథనం మేరకు.. త్రిపురాంతకం-1 ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సృజన హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో ఆమెను త్రిపురాంతకానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు శనివారం రాత్రి కారులో బయల్దేరారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మిరియంపల్లి ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు కలిసి తొలుత ఎర్రగొండపాలెంలో అటకాయించారు. అక్కడ వారిపై దౌర్జన్యం చేశారు. దుర్భాషలాడారు. తప్పించుకొని వెళ్తున్న వారిని వెంబడించారు. ఆ సమయంలో సృజన కుటుంబ సభ్యులు ఎర్రగొండపాలెం పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆంజనేయరెడ్డిని వెంబడించారు. పల్నాడు జిల్లా కారంపూడి వద్ద ఆయనతోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎంపీటీసీ సభ్యురాలు సృజన సోదరుడు సుందరబాబు ఫిర్యాదు మేరకు ఆంజనేయరెడ్డితోపాటు మిరియంపల్లి ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఎంపీపీ ఎన్నికల్లో లబ్ధి కోసమే..

జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే రాజీనామా చేసిన ఎంపీపీల స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. త్రిపురాంతకం ఎంపీపీగా ఉన్న కోట్ల సుబ్బారెడ్డి ఒప్పందంలో భాగంగా సాధారణ ఎన్నికల సమయంలోనే రాజీనామా చేశారు. ఆయన తర్వాత సోమేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ-2 ఆళ్ల సుబ్బమ్మ ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో జరిగిన ఒప్పందం ప్రకారం కోట్ల సుబ్బారెడ్డి అనంతరం జి.ఉమ్మడివరం ఎంపీటీసీ సభ్యుడైన ఆళ్ల ఆంజనేయరెడ్డి ఎంపీపీ కావాల్సి ఉంది. గతంలోనూ ఆయన ఎంపీపీగా పనిచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులలో మెజారిటీ టీడీపీ వైపు మొగ్గు చూపారు. దీంతో ఈ నెల 27న జరగనున్న ఎంపీపీ ఎన్నికల్లో ఎలాగైనా నెగ్గాలని యోచించిన ఆంజనేయరెడ్డి త్రిపురాంకతం-1 ఎంపీటీసీ సభ్యురాలి కుటుంబంపై దౌర్జన్యానికి దిగారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత

త్రిపురాంతకం మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ పార్టీకి చెందిన నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ వైసీపీకి చెందిన దర్శి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాడిపర్తి చంద్రశేఖర్‌లు స్టేషన్ వద్దకు చేరుకొని కొద్దిసేపు హడావుడి చేశారు. విధుల్లో ఉన్న మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, ఎస్సై చౌడయ్యలు వారితో మాట్లాడారు. త్రిపురాంతకం ఎంపీటీసీ-1 సృజన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలతోపాటు పెద్దఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్ వద్దకు చేరుకోవడంతో వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.26 (సోమవారం సాయంత్రం)
సహర్: 4.49 (మంగళవారం ఉదయం)

పారిశ్రామిక సిరి.. కనిగిరి

● నియోజకవర్గంలోని దివాకరపల్లిలో బయోగ్యాస్ ప్లాంట్ 7

● 5 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

● ముస్లింలకు ఇఫ్తార్ విందులో ఎస్పీ దామోదర్

రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక అని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసు కల్యాణ మండపంలో ముస్లింలకు పోలీసు శాఖ తరపున ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసంలో అత్యంత పవిత్రంగా ఉపవాసాలు ఉంటారని అన్నారు. ఈ సమయంలో ఇఫ్తార్ విందు ఇచ్చే కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు చేయడం వల్ల మనలో ఉన్న చెడును వదిలివేసి మంచిని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం మౌజన్ ఎస్‌కె.అబ్దుల్లా ప్రతేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు పాల్గొన్నారు. - ఒంగోలు క్రైం, ఆంధ్రజ్యోతి



రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట

- ఈకేవైసీ తప్పనిసరి..
- లేకుంటే కార్డుదారులకు సరుకుల నిలిపివేత
- నెలాఖరు వరకు గడువు
- జిల్లాలో 2.06 లక్షల మంది పెండింగ్



ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డుదారులకు ఈకేవైసీ అప్‌డేట్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అందుకు నెలాఖరు వరకూ గడువు ఇచ్చింది. లేకుంటే వచ్చే నెలలో రేషన్ పొందే అవకాశం ఉండదని అధికారులు చెప్తున్నారు. జిల్లాలో 6,61,206 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో 19,37,977 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు 17,31,913 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 2,06,064 మంది చేయించుకోవాల్సి ఉంది.

ఈకేవైసీ ఇలా..

కార్డుదారులు చాలామంది జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరు నెలల తరబడి గ్రామాలకు రావడం లేదు. ఇలాంటి వారి పేర్లు తొలగించకుండా ఉండాలంటే ఈకేవైసీ చేయించుకోవాలి. ఇటువంటి వారు స్థానికంగానే కాకుండా రాష్ట్రంలోని ఏప్రాంతంలో ఉన్నా అక్కడి మీ సేవ, చౌకధరల దుకాణం, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటును ఇచ్చారు. రేషన్ డీలర్లు, తహసీల్దార్లు, డీఎస్‌వోల లాగిన్లలో ఈకేవైసీ వివరాలు అందుబాటులో ఉంచారు. రేషన్ షాపులోని ఈ-పోస్ పరికరాల ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఐదేళ్ల లోపు పిల్లలు మినహా కార్డులోని సభ్యులందరూ ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నెలాఖరు లోపు ఈకేవైసీని నూరు శాతం పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఉత్సాహంగా ఉల్లాస్ పరీక్షలు

● హాజరైన 75ఏళ్ల వృద్ధురాలు


పరీక్ష రాసేందుకు వస్తున్న రమణమ్మ

చీమకుర్తి, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఆల్ ఇన్ సొసైటీ) పరీక్షలు ఆదివారం చీమకుర్తి మండలంలో ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 18కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 900మందికి గాను 892 మంది హాజరయ్యారు. ఏలూరివారిపాలెం పరీక్షాకేంద్రంలో 75 ఏళ్ల వృద్ధురాలు ఎ.రమణమ్మ ఉత్సాహంగా పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్ష రాయటం విశేషం. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. 18-75 ఏళ్ల మధ్య వయోజనులకు గత కొన్ని నెలలుగా వలంటీర్ల ద్వారా విద్యను అందించి వారికి పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి ఐదోతరగతి పాసైనట్లు ధృవీకరణపత్రాన్ని సైతం అధికారికంగా ఓపెన్ స్కూల్ వారు అందజేయనున్నారు. ఫలితాలు ఈనెల 25వ తేదీలోపు రానున్నాయి.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలలోని నిరక్ష్యరాస్య మహిళలకు ఆదివారం పరీక్షలను నిర్వహించారు. వలంటీర్ టీచర్ల ద్వారా గత మూడు నెలలుగా మండల పరిధిలో గుర్తించిన 977 మంది డ్వాక్రా గ్రూపుల్లోని నిరక్ష్యరాశ్య మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఉల్లాస్ మండల కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి రవి, కన్వీనర్ బత్తుల నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో 14 పరీక్షా కేంద్రాలలో 943 మందికి పరీక్షలను నిర్వహించారు. మద్దిరాలపాడు, చదలవాడ, నాగులుప్పలపాడులోని పరీక్షా కేంద్రాలను వయోజనవిద్య జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.సురేఖ, సూపర్‌వైజర్ కె.జ్యోతి పరిశీలించారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలో ఉల్లాస్ పరీక్షకు 566 మంది అభ్యాసకులు హాజరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. లింగంగుంట, పెద్దకొత్తపల్లి, సీతారాంపురం, గుండ్లాపల్లి, కీర్తిపాడు, రాచవారిపాలెం, గాజులవారిపాలెం గ్రామాల్లో పరీక్షలు నిర్వహించామని చెప్పారు.

విద్యారంగ సమస్యలపై పోరుబాట

● యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఒంగోలు విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పోరుబాట చేపట్టనున్నట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనాన్ని నిలిపివేయాలని డిమాండ్‌చేశారు. దీనివల్ల వేలాది ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ స్కూళ్లగా మిగిలే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని, యూపీ స్కూళ్లను యథాతథంగా కొనసాగించాలని, హైస్కూళ్లలో తెలుగు మీడియం కూడా ఉంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల కోసం సంబంధించి పీఆర్‌పీ కమిషన్‌ను ఏర్పాటు, పెండింగ్ డీఏలు మంజూరు, ఐఆర్, పాత బకాయిలను, సరెండర్‌లీవు, సీపీఎస్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై మాట్లాడుతూ వచ్చేనెల 5న తిరుపతిలో జరగనున్న ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ కం రోస్టర్ విధానం పాటించాలి

● బీటీఏ జిల్లా ప్రధానకార్యదర్శి మాధవరావు

ఒంగోలు విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలు మెరిట్ కం రోస్టర్ విధానంలో తయారు చేయాలని బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి కర్ర దేవసహాయం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు డీఈవో ప్రకటించారన్నారు. అయితే మెరిట్ ఆధారంగా తయారు చేశారని, దానివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్నివర్గాల మహిళలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల జాబితాలను సవరించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ గత 25 ఏళ్ళ నుంచి మెరిట్ కం రోస్టర్ విధానం కోసం బీటీఏ పోరాటం చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జాలరామయ్య, శరత్‌చంద్రబాబు, జగన్నాథం ప్రసాదరావు, జి.శ్రీనివాసులు, నూకతోటి కుమారస్వామి, కె.కొండలరాయుడు, చెక్క కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

మద్దిపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ శివరామయ్య కోరారు. ఆదివారం మండలంలోని సీతారమపురం కొస్టాలు సెంటర్, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ వద్ద తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఏఎస్ఐ రమేష్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు బ్యుటీషియన్ కోర్సులో శిక్షణ

సంతనూతలపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద మహిళాప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు బ్యుటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ అంజమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 15-45 ఏళ్ల వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, వివరాలకు సెల్ నెం : 8333921346లను సంప్రదించాలన్నారు.

ఆర్పీలకు బెదిరింపులు!

'సీఎం సభ పేరుతో వసూళ్లు' కథనంపై సీఎంఎం ఆగ్రహం

విచారణ చేసేందుకు మెప్మా పీడీ సిద్ధం

కలెక్టర్‌కు విన్నవించాలని పలువురు ఆర్పీల నిర్ణయం

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరైన సభకు ఖర్చుల పేరుతో మెప్మాలో డబ్బులు వసూళ్ల వ్యవహారం చినికిచినికి గాలివానలా మారుతోంది. ఈ వసూళ్లపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన సీఎం సభ పేరుతో వసూళ్ల అనే కథనంపై ఆ శాఖాధికారులు ఉలిక్కిపడ్డారు. తాము సూచించిన కొన్ని నకిలీ పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకు తాయిలాల రూపంలో బహుమతులు ఇచ్చిన సిటీ మిషన్ మేనేజరు(సీఎంఎం), సీవోలు.. వాటి తాలూకా ఖర్చును సీఎం సభ పేరుతో సంబంధిత ఆర్పీల వద్ద నుంచి వసూళ్ల చేయడాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ వసూళ్ల భాగోతంలో కీలకంగా వ్యవహరించిన సీఎంఎం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేకించి, కొందరు ఆర్పీలకు ఫోన్లు చేయడంతోపాటు, అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 'మీ అందరి లెక్కలు తేలుస్తా'నంటూ బెదిరించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంచితే తాను ఒక్కదానినే డబ్బులు అడగలేదని, సీవోలు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారని సీఎంఎం పలువురితో మాట్లాడటం ఇప్పుడు చర్చనీయంశంగా మారింది. ప్రతి ఆర్పీ నుంచి రూ.400 వసూళ్ల చేయడంపై పీడీ శ్రీహరి విచారణ చేసి, వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు సిద్ధమయ్యారు. సీవోలు, సీఎంఎంలు తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఇప్పటికే తమదైన శైలిలో రకరకాల మాయోపాయాలు చేస్తున్నారు. డబ్బులు అడిగిన విషయం బయటకు ఎలా వెళ్లింది ? ఆంధ్రజ్యోతిలో ఎవరు రాయించారు ? అన్నీ తేలుస్తాను మాట్లాడటంపై కొందరు ఆర్పీలు నేరుగా కలెక్టర్‌ను కలసి, తమ గోడు వెళ్లబోసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ఇలా బెదిరింపులకు పాల్పడితే రాబోయే రోజుల్లో సీఎంఎం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్న భయం వారిని వెంటాడుతుంది. కలెక్టర్‌ను కలిసి వాస్తవాలు వెల్లడించడానికి సిద్ధమైనట్లు సమాచారం. అలాగే విచారణ కమిటీని నియమించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

● మంత్రి స్వామికి జిల్లా రొయ్యల రైతుల సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి


మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఆక్వా రైతులు

ఒంగోలు నగరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి రైతులు విజ్ఞప్తి చేశారు. జిల్లా రొయ్యల రైతుల సంఘం నాయకులు ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న రైతులందరికీ సబ్సిడీ విద్యుత్‌ను అందించాలని కోరారు. గత కొన్నేళ్లుగా నాణ్యమైన సీడ్ అందక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నాన్ ఆక్వా జోన్‌లోని రైతులు, పది ఎకరాల పైబడి ఉన్న రైతులకు సబ్సిడీ అందటం లేదని చెప్పారు. దీంతో అనేక మంది నష్టాలను భరించలేక రొయ్యల చెరువులను బీడులుగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 హెచ్‌పీ లోడు విద్యుత్ కనెక్షన్లు ఉన్న చిన్న, సన్నకారు ఆక్వా రైతులకు అధికారులు ఇటీవల డిజిటల్ ప్రీపెయిడ్ మీటర్లు బిగిస్తున్నారని, దీనివల్ల రైతులు ముందుగా రీచార్జి చేసుకుని సాగు చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై మంత్రి స్వామి స్పందిస్తూ ఆయా సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రొయ్యల రైతుల సంఘం అధ్యక్షులు దుగ్గినేని గోపీనాథ్, కార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షులు పమిడి సుబ్బారాయుడు, నాయకులు నార్నే రమేష్, కోటపాటి వెంకటేశ్వర్లు, దివి హరిబాబు, నార్నె సింగయ్య, కె.భాస్కరరావు, రమేష్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే చర్యలు

● ఎంపీపీ శ్రీనివాసరావు హెచ్చరిక

● గంటలోపే మండల సమావేశం పూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి, మార్చి23(ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన ప్రొటోకాల్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు హెచ్చరించారు. చీమకుర్తి మండల సర్వసభ్యసమావేశం ఆదివారం ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన మండలపరిషత్ కార్యాలయంలో జరిగింది. మండల పరిషత్ ఖాతాలో ఏడాది నుంచి మూలుగుతున్న దాదాపు రూ.20కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులను నిర్వహించటానికి తీర్మానాలను ప్రవేశపెడ్తారని ఆశతో వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆశలు అడియాశలు అయ్యాయి. ఆ ఊసే లేకుండా సమావేశం ఆసాంతం కేవలం శాఖల వారి సమీక్షలతోనే సరిపెట్టారు. ఎటువంటి తీర్మానాలు లేకుండా గంటలోపే మమ అనిపించేలా సమావేశాన్ని ముగించటం విశేషం. కాగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియను కూనంనేనివారిపాలెం ఎంపీటీసీ నిలదీశారు. తాను ప్రతీ సమావేశంలో గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరానన్నారు. ఇపుడు దీనికి సంబంధించిన సంపు నిర్మాణపనుల విషయం తనకు ఎటువంటి సమాచారం ఇవ్వటం లేదని వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ జోక్యం చేసుకొని ప్రొటోకాల్ విషయంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల నిర్వహణలో పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులకు గౌరవాన్ని ఇవ్వాలన్నారు. మండలపరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, బోర్లకు మరమ్మతులు, కొత్త బోర్లు ఏర్పాటు త్వరితగతిగా చేపట్టాలని ఏఈకు సూచించారు. విద్యుత్ సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. గ్రానైట్ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యంను నివారించాలని పరిశ్రమల అభివృద్ధి అధికారిని ఎంపీపీ కోరారు. చివరగా ఆయన మాట్లాడుతూ తాము పగ్గాలు చేపట్టిన తర్వాత ఇప్పటివరకూ రూ.26కోట్లతో 902 రకాల పనులను చేపట్టామని ప్రజాప్రతినిధుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. రాబోయే సమావేశంలో మరిన్ని అభివృద్ధి పనులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తనకు రాతపూర్వకంగా తెలిపితే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాఘవేంద్ర, మండల అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

● ఆగస్టులో నిర్వహణ

● వచ్చే నెల 10న పేదల పక్షాన భూపోరాటం

● రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఈశ్వరయ్య


మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టులో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ల ఉద్యమ చరిత్ర కలిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాయకులు, పూర్వపు కార్యకర్తలు, అభిమానులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే నెలంతా ఇంటి స్థలాలు, సాగు భూమి కోసం, టిడ్కో గృహాల సాధన కోసం పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అనేక హామీలు విస్మరించిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 10న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల పక్షాన భూపోరాటం చేస్తామని, లేఅవుట్లను పరిశీలిస్తామన్నారు. వెంటనే ప్రభుత్వ హామీ మేరకు లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వాలని, లేనిపక్షంలో సీపీఐ ఎర్రజెండాలు పాతుతుందని, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఆర్.వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాస్, అందె నాసరయ్య ఎం.విజయ, ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరవీరులకు నివాళులు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఆదివారం స్వాతంత్ర్య సమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పుర స్కరించుకుని పలు విద్యార్థి సంఘాలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

- స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, పి.ప్రభాకర్, కరుణానిధి, పవన్‌కళ్యాణ్, రామాంజీ, పురిణి రాంబాబు, సుబ్బారావు, గులాం హుస్సేన్, కె.వీరారెడ్డి, వెంకట్రావు, నాసరయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎం.రమేష్‌బాబు, డి.శ్రీనివాస్, మౌలాలి, కృష్ణగౌడ్, శ్రీరామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అవినాష్, శామ్యూల్, ఆనంద్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

- జనసాహితి ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జన సాహితి అధ్యక్షుడు డాక్టర్ జీవీ.కృష్ణయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా, డాక్టర్ శాంతికుమార్, ప్రసన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఒంగోలులో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేద్కర్‌భవన్ నుంచి కలెక్టరేట్ మీదుగా చర్చిసెంటర్ వరకు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రామ్మోహన్, నాయకులు శ్యామ్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాగర్, జాలన్న, హనమంతరావు, శివ, మహేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో

ఒంగోలు కల్చరల్: స్థానిక జిల్లా గ్రంథాలయంలో షాహిద్ దివస్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాలాది మోహన్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా షాహిద్‌దివస్‌ను జరుపుకుంటామన్నారు. ఉప గ్రంధపాల కురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, డ్రాయింగ్ క్రాయిన్స్ బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, పి.ఇమ్మానుయేలు, ఎస్.అనిల్‌బాబు, పి.దయామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌సీఎస్ అకాడమీ ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, కాకుమాను సుబ్బారావు, వేణు పాల్గొన్నారు.

వజ్జిరెడ్డిపాలెంలో..

కొత్తపట్నం: వజ్జిరెడ్డిపాలెంలో భగత్‌సింగ్ వర్ధంతిని డీఐఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో ఎస్.స్వామిరెడ్డి, జి.దశరథ, కోటా జాలరామిరెడ్డి, జి.శంకర్, డి.గోపి, కె.నాని, జి.సంజయ్, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


వజ్జిరెడ్డిపాలెంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు, విద్యార్థులు

ఒంగోలులో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

● ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆదివారం పార్లమెంట్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా కేవలం 12 జిల్లాల్లో మాత్రమే ఈఎస్ఐ వైద్యశాలలు ఉన్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో 3003 చిన్న, మధ్యతరహా, పెద్ద కార్మాగారాల్లో 86వేల మంది ఉద్యోగ, కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఈఎస్ఐ హాస్పిటల్ లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అనేక సంవత్సరాల నుంచి ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, కార్మికులు, కార్మిక సంఘాలు ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, అందువల్ల ఒంగోలులో వైద్యశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాగుంట విజ్ఞప్తి చేశారు.

రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పరిశీలన

సంతనూతలపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మైనంపాడు గ్రామంలో జరుగుతున్న రేషన్ కార్డుదారుల ఈకేవైసీని ఆదివారం ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ గుణవంశీ పరిశీలించారు. కార్డుదారులు ఈనెల 31లోపు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని ఆయన కోరారు.

మందుబాబులపై కేసు

టంగుటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఐదుగురు మందుబాబులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మర్లపాడు గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో పలువురు మద్యం సేవిస్తున్నట్లు డ్రోన్ ద్వారా పోలీసులు గుర్తించారు. ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

70మందికి కంటి వైద్య పరీక్షలు

మద్దిపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మల్లవరం గ్రామంలో ఆదివారం లలిత ప్రథమ చికిత్స కేంద్రం, ఒంగోలు యామిని కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 70 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్ ఖర్చులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ ఎన్‌వీఎస్.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఆదర్శవంతంగా జీవించాలి : ఎస్ఐ


సర్పంచ్, వార్డు సభ్యులతో ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత ఆదర్శవంతంగా జీవించాలని ఎస్ఐ బి.శివరామయ్య పేర్కొన్నారు. శనివారం రాత్రి నాగన్నపాలెంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి


సీజ్ చేసిన మద్యం సీసాలతో ఎస్ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ బి.శ్రీకాంత్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా 25 క్వాటర్, 90 ఎంఎల్ బాటిళ్లు 9 స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుళ్లు తిరుపతిరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు. అమ్మనబ్రోలు శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ శ్రీకాంత్ దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.7,500 నగదు సీజ్ చేశారు.

పాఠశాలకు సామగ్రి బహూకరణ


బీరువా, కుర్చీలు, ఫ్యాన్లు అందజేసిన క్లబ్ ప్రతినిధులు

కొత్తపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలం డీడీకాలనీలోని ప్రాథమిక పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో బహూకరించారు. హెచ్‌ఎం సూర్యకుమారి అభ్యర్థన మేరకు పాఠశాలకు బీరువా, కుర్చీలు, ఫ్యాన్లను సిటిజన్స్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, ఉపాధ్యాయులు చార్లెస్‌బాబు, హనుమంతరావు, జయలత, వేణు, క్లబ్ ప్రతినిధులు ఈదర వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పార్థసారధి, కార్యదర్శి లక్ష్మణస్వామి, క్లబ్ ఫౌండర్ కె.రమేష్, పూర్వ అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్‌కానిస్టేబుల్స్ సంఘ నూతన కమిటీ


ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యుల ఆనందోత్సాహం

ఒంగోలు క్రైం, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్‌కానిస్టేబుల్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా శిరిగిరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం పి.శ్రీనివాసులు ప్యానల్, ఎస్‌కే.సలీమ్‌బాషా ప్యానల్ మధ్య పోటీ జరిగింది. పి.శ్రీనివాసులు ప్యానల్ గెలుపొందింది. ఎన్నికల అధికారిగా సీఐ బి.ఈశ్వరరావు, ఎస్.రామారావు వ్యవహరించారు. కమిటీలో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్.శ్రీనివాసరావు, కోశాధికారి గురవయ్య, వైస్ ప్రెసిడెంటుగా కాశయ్య, జయసూర్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.మాధవరావు, ఎస్.నిరంజన్‌రెడ్డి, ప్రెస్ సెకటరీలుగా ఎంవీ.కోటేశ్వరరావు, అనుదుల్లా, మెంబర్లుగా ప్రసాదరావు, ఆర్.సత్యనారాయణ, డి.వెకంటరావు, పి.నాగరాజు ఎన్నికైనట్లు ప్రకటించారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

మద్దిపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సీడీపీవో ఇవాంజలిన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడు మండలం గుండ్లాపల్లి జడ్పీ హైస్కూల్, నాగులుప్పలపాడు జడ్పీ స్కూల్, బండమూడి జడ్పీ స్కూల్, చిలకపాడులలో ఐదు బ్యాచుల్లో 276 మందికి శిక్షణ ఇస్తామన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని చిలకపాడు హైస్కూల్లో సోమవారం నుంచి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు సంతనూతలపాడు సూపర్‌వేజర్లు నాగలక్ష్మి, పిచ్చమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైవీని పరామర్శించిన బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డిని ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల వైవీ మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను బూచేపల్లి కలిసి సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక జాతర



దర్శనానికి పోటెత్తిన భక్తులు

మార్కాపురం వన్ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉగాది ముందు వచ్చే నాలుగో ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక జాతర నిర్వహించారు. అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం పొంగళ్లు వండి బోనాలు సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. నాగదేవతలకు నాగులపుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

పోలేరమ్మ



అమ్మవారికి కుంకుమ బండ్లు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఓరా.. ఆరుకాళ్ల మేకపిల్ల!



కురిచేడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులమంద పంచాయతీ రామాంజనేయ కాలనీలో ఆదివారం ఒక మేకకు ఆరు కాళ్ల మేకపిల్ల పుట్టింది. ఇది ఆరోగ్యంగానే ఉన్నట్లు కాపరి రామారావు తెలిపారు. ఈ మేక పిల్లను ప్రజలు వింతగా చూస్తున్నారు.

పారిశ్రామిక సిరి.. కనిగిరి

రాష్ట్రంలోనే పారిశ్రామికగిరిగా కనిగిరి రూపాంతరం చెందనుంది. అందుకు ఒక్కొక్క అడుగు ముందుకు పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనిగిరి అభివృద్ధికి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. అందులో భాగంగా పారిశ్రామిక ప్రగతికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చూపుతున్న చొరవ మైలురాయిగా నిలవనుంది. నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలోని దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న మంత్రి లోకేష్ రిలయన్స్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో కనిగిరి ప్రాంతంలో దాదాపు 5వేల మందికి పైగా ప్రత్యకంగా ఉపాధి లభించనుండగా, మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి చేకూరనుంది.

కనిగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

నియోజకవర్గంలోని దివాకరపల్లిలో బయోగ్యాస్ ప్లాంట్

5 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి

బీడు భూముల రైతులకూ ఆదాయ వనరు

సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషితో రిలయన్స్ సంస్థ అంగీకారం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో శరవేగంగా ఏర్పాట్లు

చంద్రబాబు సహకారం.. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రచొరవ...

గత టీడీపీ ప్రభుత్వంలోనే కృషి

2014లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలోనే కనిగిరికి పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి సీఎం చంద్రబాబు అత్యంత చొరవ చూపారు. అందులో భాగంగా కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు కోసం వేలాది ఎకరాలు భూమిని కూడా గుర్తించి ఏపీఐఐసీకి అప్పగించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనిగిరి అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కొలువుదీరగా అనతికాలంలోనే ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో పారిశ్రామికంగా ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ కంపెనీ ఆసక్తిగా ముందుకొచ్చింది. అందుకు అనువుగా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని వినియోగించుకుంటే అటు సంస్థకు ఇటు కనిగిరి ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చంద్రబాబుతో విన్నవించారు. దీంతో రిలయన్స్ సంస్థ అంగీకారంతో పాటు సీఎం చంద్రబాబు సహకారంతో పీసీపల్లి మండలంలో దాదాపు 12వేల ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అందులో రిలయన్స్ ఇంటిగ్రేటెడ్ బయోగాస్ ప్లాంట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.

● శరవేగంగా భూమి పూజకు పనులు

ప్లాంట్ నిర్మాణానికి ఏప్రిల్ 2న శంకుస్థాపన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం మూడు భాగాలుగా ఆయా భూమిని విభజించి ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నారు. జంగిల్ క్లియరెన్స్‌కూడా చేస్తున్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం కోసం మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవచూపి విద్యుత్ అధికారులను అప్రమత్తం చేసి ఆ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు.



శంకుస్థాపన ప్రదేశానికి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న రోడ్డు

● ప్లాంట్ ఏర్పాటుతో రైతులకు మేలు

ప్లాంట్ ఏర్పాటు చేస్తే కనిగిరి ప్రాంతంలోని బీడు భూములు కూడా పరోక్షంగా వినియోగంలోకి వస్తాయి. బీడు భూముల్లో సైతం గడ్డిని పెంచి ఆయా గడ్డిని ప్లాంట్‌కు ఇచ్చే ఏర్పాట్లపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తుంది. దీంతో రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరనుంది.

5న జిల్లా స్థాయి భజన పోటీలు

కొత్తపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామంలో జరగనున్న శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 4వ తేదీన జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మిట్నసల రామకోటయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన బృందాలకు వరుస బహుమతులు రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే బృందాలు తమ వివరాలను 4 తేదీలోగా అందజేయాలని కోరారు. బృందంలో 15 మందికి తగ్గకుండా, అందరూ సంప్రదాయ దుస్తుల్లోనే ఉండాలని, నాలుగు పాటలకు తగ్గకుండా ప్రదర్శన చేయాలని సూచించారు. వివరాలకు 9849600159, 9951160038 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శభాష్ పోలీస్

నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడికి సపర్యలు



స్నానం చేయిస్తూ...

ఒంగోలు క్రైం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని పోలీసులు నిరూపించారు. నిత్యం విధులలో బిజీగా ఉండే పోలీసులు మేముసైతం అన్నట్లు సామాజిక స్పృహను గుర్తెరిగారు. ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఓ వృద్ధుడు నిస్సహాయస్థితిలో పడి ఉన్నాడు. అతడి పరిస్థితిని చూసి చలించిపోయిన హెడ్ కానిస్టేబుల్ అక్బర్ సాహెబ్, కానిస్టేబుల్ యోగినారాయణ, మహిళా హోంగార్డు ఝాన్సీలు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ ముగ్గురు కలిసి వృద్ధుడికి సపర్యలు చేశారు. స్వయంగా స్నానం చేయించి దుస్తులు వేసి, టిఫిన్ పెట్టించారు. ఆ తర్వాత ఆరా తీయగా ఆ వృద్ధుడు.. తనది పమిడిపాడు అని, పేరు వెంకటేశ్వరరెడ్డి అని చెప్పాడు. అయితే అతనిని వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులు మోటార్ బైక్‌పై తీసుకొచ్చి అక్కడ వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. వృద్ధుడి పట్ల మానవత్వం ప్రదర్శించిన పోలీసులను చూసి శభాష్ అంటూ పలువురు అభినందించారు.



టిఫిన్ పెడుతూ...

పిల్లలపై అకృత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు

జిల్లా న్యాయాధికారి భారతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి

సింగరాయకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిదేళ్లలోపు పిల్లలపై లైంగిక నేరాలకు, అకృత్యాలకు పాల్పడితే చట్టంలో కఠినశిక్షలు ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ. భారతి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పాకలలో ఆదివారం లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారిణి మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం పోక్సో చట్టాన్ని రూపొందించారన్నారు. చిన్నారులను మానసికంగా, శారీరకంగా వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలపై అకృత్యాలపై పాల్పడితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు హేమలత, బాలాజీ, నిఖిల్‌రెడ్డి, తహసీల్దార్ రవి, సీఐ హజరత్తయ్య పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో నిర్లక్ష్యంపై సీరియస్

ఎంఈవోలను వివరణ కోరిన డీఈవో

ఒంగోలు విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు విడుదలైన కాంపోజిట్ గ్రాంటు ఖర్చు చేయకపోవడంపై సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, డీఈవో కిరణ్‌కుమార్ సీరియస్ అయ్యారు. దీనిపై ఎంఈవోలను వివరణ కోరారు. జిల్లాలోని 87 పాఠశాలలకు విడుదలైన రూ.9 లక్షలు వినియోగించకపోవడంపై 'స్కూల్ గ్రాంట్ వినియోగంలో నిర్లక్ష్యం' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై డీఈవో స్పందించారు. మండలాల వారీ స్కూలు పేరు, నిధులు వినియోగించకపోవడానికి కారణాలను నిర్దిష్టంగా తెలియజేయాలని ఆయన ఎంఈవోలను ఆదేశించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వారే తూట్లు పొడుస్తున్నారు

రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం ఏకపక్ష నిర్ణయం

రంగా భవన్‌లో నిర్వహించిన సదస్సులో మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి గల్లీ దాకా అన్ని పదవుల్లో ఉన్న వారు రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసి అధికారం చేపట్టిన వెంటనే అదే రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు. స్థానిక రంగాభవన్‌లో జిల్లా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భారత రాజ్యాంగం-కనీస అవగాహన సదస్సుకు వేదిక జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. సభలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం, మార్కెటింగ్ రాష్ట్రాల పరిధిలో ఉండగా వారిని సంప్రదించకుండా కేంద్రం ఏకపక్షంగా మూడు నెలల వ్యవసాయచట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా గళం విప్పిన రైతు సంఘాల నాయకులపై, రైతులపై ఆందోళనలు చేయకుండా రోడ్లపై మేకులు గుచ్చారని విమర్శించారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా కేంద్రప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. వచ్చేనెల 13న విజయవాడలో మత సామరస్యం కాపాడుకోవాల్సిన అవశ్యకతపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్, వివిధ సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చావలి సుధాకర్, బి. పద్మ, వడ్డె హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, లలితకుమారి, కోడూరి నాంచారం పాల్గొన్నారు. రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డిని ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, పక్కన రంగారావు, వెంకటేశ్వర్లు, సుధాకర్, పద్మ

అమరావతిలో కమ్మభవన్ నిర్మాణం

ఘనంగా కమ్మవారి సేవా సంఘు రాష్ట్ర సదస్సు

పలు తీర్మానాలు ఆమోదం

ఒంగోలు కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో కమ్మభవన్ నిర్మాణం చేయాలని కమ్మవారి సేవా సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని వీకేబీ రెసిడెన్సీలో ఉభయ తెలుగు రాష్ట్రాల కమ్మ ప్రతినిధుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కమ్మ ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, పోటీ పరీక్షలకు కోచింగ్, నిరుపేదలకు వైద్య సహాయం, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించటం, నిరుద్యోగ యువతకు వృత్తి నిపుణలతో శిక్షణ, అర్హులైన వారికి స్వయం ఉపాధి కల్పన మొదలైన అంశాలపై తీర్మానం చేశారు. కమ్మవారి చరిత్ర, కమ్మ ప్రముఖుల చారిత్రక గ్రంథాలు సేకరించి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, కాకతీయ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా 100 వసతి గృహాల నిర్వహణ, కమ్యూనిటీ కిచెన్‌ల ఏర్పాటు, దేశ విదేశాల్లో కమ్మ మహాసభ నిర్వహణ వంటివి చేపట్టాలని తీర్మానించారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కమ్మవారి సేవా సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అనే సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గన్ని భాస్కరరావు, గూడూరి సత్యనారాయణ, జీవీ రాముడు, కొత్తపల్లి రమేష్ చంద్ర, చల్లా రాజేంద్రప్రసాద్, సామినేని కోటేశ్వరరావు, అక్కెన మునికోటేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణ, మందలపు జగదీష్, కనకమేడల చక్రవర్తి, జిల్లా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, ప్రధానకార్యదర్శి ఆలా హనుమంతరావు, కాట్రగడ్డ రఘు, బాపయ్య చౌదరి, వెంకటనారాయణ, అబ్బూరి నవీన్, దుగ్గినేని వెంకట్రావు, గోగినేని శ్రీను, బొడ్డపాటి వెంకట్, మండవ సుబ్బారావు, రావుల పద్మజ, వడ్డెంపూడి సుజాత, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కంచర్ల నారాయణ, నాగబోయిన భాస్కరరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న భాస్కరరావు, సత్యనారాయణ, రాముడు, రమేష్‌చంద్ర, రాజేంద్రప్రసాద్

అవీ..ఇవీ

వెంకటాపురం తండాలో ఉచిత వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గిద్దలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సత్య సాయిబాబా శతజయంతి దినోత్సవాలలో భాగంగా మండలంలోని వెంకటాపురం తండాలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రమణరెడ్డి 65 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, కమిటీ ప్రతినిధులు అన్నాగోపాల్, భిక్షం, శింగరి ప్రసాద్, ఓబులేసు, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

బేస్తవారపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బేస్తవారపేట కార్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 'పోషణ్‌బీ-పడాయిబీ' కార్యక్రమంపై మొదటి బ్యాచ్‌కు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో నీలోఫర్ తెలిపారు. ఈ శిక్షణలో ఆదర్శం, నవచేతన, పౌష్టికాహారం వంటివి కార్యకర్తలందరికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున తప్పక మజరుకావాలని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

రాచర్ల (గిద్దలూరు), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారెడ్డిపల్లి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ డి.సుమంత్ గాయపడ్డాడు. గిద్దలూరు ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుమంత్ మోటార్ సైకిల్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్ గాయపడిన సుమంత్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

యువత బెట్టింగ్ మాయలో పడవద్దు

గిద్దలూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై యువత బెట్టింగ్ మాయలో పడవద్దని గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాశతో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని యువకులు బెట్టింగ్ ఉచ్చులోపడి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతూ దొరికితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ బుక్కర్ల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఐపీఎల్ మోజులోపడి చదువును అశ్రద్ధ వహించవద్దని, చక్కగా చదివి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.

డ్వాక్రా మహిళలకు 'ఉల్లాస్' అక్షరాస్యత పరీక్షలు


పరీక్ష రాస్తున్న మహిళలు

మార్కాపురం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బోడపాడు, బొందలపాడు, భూపతిపల్లి, మిట్టమీదిపల్లి, పడమటిపల్లి, చింతగుంట్ల గ్రామాలలో ఉల్లాస్ అక్షరాస్యత పరీక్షను స్వయం సహాయక సంఘాల మహిళలు ఆదివారం ఆయా గ్రామాలలోని పరీక్షా కేంద్రాలలో రాశారు. ఈ పరీక్షా కేంద్రాలను వయోజన విద్య సూపర్ వైజర్ రజిని, మార్కాపురం వెలుగు ఏపీఎం పిచ్చయ్యలు పర్యవేక్షించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా గ్రామాలలో వీవోఏలు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించి స్వయం సహాయక సంఘాల మహిళల పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాలను సీసీలు, మనోకుమారి, నాగయ్యలు పర్యవేక్షించారు.

పరమాత్ముని అవతరణకు స్మృతి చిహ్నమే ఉగాది



చిన్నారులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 23 ఆంధ్రజ్యోతి: పరమాత్ముని అవతరణకు స్మృతి చిహ్నమే ఉగాది పండుగ అని బ్రహ్మకుమారి సరస్వతి అన్నారు. స్థానిక ఎన్ఎస్ నగర్‌లోని బ్రహ్మకుమారి కార్యాలయంలో ఉగాది ఆధ్యాత్మిక రహస్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి అక్కయ్య మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం రుద్రాభిషేకం, ఆధ్యాత్మిక సందేశం, రాజయోగ మెడిటేషన్, స్నేహ నాట్య అకాడమీ విద్యార్థులతో వివిధ నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో బేతంచర్ల, చీమకుర్తి, బెంగళూరుల నుంచి బ్రహ్మకుమారిలు మాదవి, ప్రభా, సృజనలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రహ్మకుమారిలు పాల్గొన్నారు.

సీతానాగులవరంలో తాగునీటి సమస్య


రెడ్డి వీధిలో మరమ్మతులకు గురైన డీప్ బోరు

తర్లుపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానాగులవరంలోని పలు వీలు వీధుల్లో మంచినీటి సమస్య నెలకొంది. ముఖ్యంగా రెడ్డివీధిలోని డీప్‌బోరు మూడు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. అలాగే ఇందిరమ్మ కాలనీలోని డీప్ బోరు రెండు నెలల క్రితం మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయా వీధుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేని పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు వాపోయారు. వెంటనే మరమ్మతులకు గురైన డీప్ బోరులను బాగు చేయించాలని విన్నవించుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరారు.


ఇందిరమ్మ కాలనీలో మరమ్మతులకు గురైన డీప్ బోర్

దళితులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశానవాటిక వద్ద ప్రత్యేక ప్రార్థనలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దళితులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీకి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా 9వ వార్డు నుంచి 19వ వార్డు వరకుగల ప్రజలు శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎంతోమంది శ్మశానం లేక పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అప్పట్లో తాను శ్మశానం ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. సుమారు 20 వేల మంది ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారుల సహకారంతో భగత్‌సింగ్ కాలనీకి సమీపంలో నూతన శ్మశానానికి అనువైన స్థలాన్ని సేకరించామన్నారు. భవిష్యత్తులో మున్సిపాలిటీ నిధులతో శ్మశానాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చర్చిలకు చెందిన పాస్టర్లు ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు దూదేకుల మస్తానయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, కౌన్సిలర్లు నాలి కొండయ్య, కశ్శెట్టి నగేష్, దారివేముల హర్షితబాబీ, నాయకులు ధనంకుల హరిబాబు, మాజీ కౌన్సిలర్లు జవ్వాజి రాజు, చిత్తారి పెద్దన్న, పాస్టర్లు ఫ్రాంక్లిన్, ఆదాము, మంచా ఏలియా, ఆంద్రూస్, సామ్యేల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి క్రికెట్ టోర్నమెంట్

తర్లుపాడు, మార్చి 23 ఆంధ్రజ్యోతి: మండలంలోని జగన్నాథపురంలో ఈ నెల 30వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. క్రీడల కరపత్రాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విడుదల చేశారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.70 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనదలిచిన వారు ఈ నెల 20లోపు ఎంట్రీ ఫీజు రూ.2 వేలు చెల్లించి రసీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 7780603930, 9346870549 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్ కాలనీవాసులు

గిద్దలూరుటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకశ్రద్ధతో పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పీఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి కళ్యాణ మండపం ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు పార్టీ శ్రేణులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ముండ్లపాడులోని శ్మశానవాటికను అభివృద్ధి చేసి రక్షణ గోడ నిర్మించాలని, అలాగే సగి లేరువాగు ముంపు ప్రాంతాలలో రక్షణగోడ ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్పందించారు. ఆయా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే తన బాధ్యత అన్నారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు కాశిరంగారెడ్డి, బోయిళ్ళపల్లి కిశోర్, బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


మార్కాపురంలో సేవా కార్యక్రమాలను ప్రారంభిస్తున్న గోపీచంద్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ మార్కాపురం శాఖ నూతన ప్రమాణస్వీకరణ సందర్భంగా ఆదివారం పట్టణంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాదరక్షలు పంపిణీ చేశారు. చెప్పులు కుట్టేవారికి గొడుగులు, నటరాజ్ హోటల్ ఎదుట చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గోపీచంద్, క్యాబినెట్ సెక్రటరీ వీవీ సుబ్బయ్య, జీఎస్టీ కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, రీజియన్ చైర్ పర్సన్ పులి శ్రీనివాస్ ప్రసాద్, మార్కాపురం శాఖ అధ్యక్షులు డీవీ రామకృష్ణారావు, కోశాధికారి రంగయ్య, ఉపాధ్యక్షులు హరనాథ్ బాబు, బూపని కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభం : కంభం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆరవీటి వెంకట కనక రమేష్ మనుమరాలు సావిత్రి సహకారంతో కందులాపురం పంచాయతీలోని 25 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, కూరగాయలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ గోపీచంద్ అధికారిక పర్యటనలో భాగంగా లయన్స్‌క్లబ్ ఐదు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్ మహమ్మద్‌గఫార్ అలీఖాన్ ఆర్థిక సహకారంతో మూడు అంగన్‌వాడి కేంద్రాలకు ర్యాక్, ఆటవస్తువులు, బ్యాగ్‌లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గవర్నర్ గోపీచంద్, క్లబ్ అధ్యక్షులు వెంకటరామకృష్ణ, సెక్రటరీ సుబ్బయ్య, సమన్వకర్త వెంకటేశ్వర్లు, జోనల్ చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్, కార్యదర్శి కె.గుండయ్య, ఎం.మహబూబ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

సీనియర్ విభాగంలో కడప జిల్లా ఎడ్ల సత్తా


ఎడ్లపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కొనకనమిట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగొండలో ఎడ్లపందేలు మూడవరోజు హోరాహోరీగా సాగాయి. వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా మూడవ రోజు సీనియర్ విభాగంలో పోటీలు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈపోటీలలో కడప జిల్లా, చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్రోబుల్‌రెడ్డికి చెందిన ఎడ్లజత 3759.05 అడుగుల దూరంలాగి మొదటి బహుమతిని గెలుచుకొంది. నంద్యాల జిల్లా గుంపరమనుదిన్నెకు చెందిన కుందురు రాంబూపాల్‌రెడ్డి ఎడ్లు 3743.09 అడుగులు దూరంలాగి రెండవ బహుమతిని గెలుపొందాయి. బాపట్లజిల్లా వేటపాలెంకు చెందిన అత్తోటి శిరీషచౌదరి ఎడ్లజత 3644.04 అడుగులు లాగి మూడవ బహుమతిని దక్కించుకున్నాయి. బపట్లజిల్లా బల్లికురవ గ్రామానికికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎడ్లు 3355 అడుగులులాగి నల్గవ బహుమతి గెలుపొందాయి. నంద్యాలజిల్లా జిల్లెలా హేత్విక్‌రెడ్డి, దినేషరెడ్డిల ఎడ్లు 3302.07 అడుగులు లాగి ఐదవస్థానంలో నిలిచాయి. ప్రకాశంజిల్లా వీరాయపాలెంకు చెందిన పెద్ద చాంద్ ఎడ్లజత 3272 అడుగులు దూరంలాగి ఆరవస్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ 80 వేలు రూపాయలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10వేలు అందజేశారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి). స్థానిక మార్కెట్ యార్డులో ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు కోరారు. ప్రభుత్వం క్వింటాల్ కందులకు రూ.7550 , శనగలకు రూ.5650లు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

పెద్దదోర్నాల : ప్రభుత్వం పీఏసీఎస్ ద్వారా గిట్టుబాటు ధరల కోసం కందులు, శనగలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏవో జవహర్‌లాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజనులో సాగు చేసిన కంది, శనగ పంటలకు ప్రభుత్వం మద్దతుధర ప్రకటించిందని, బయట మార్కెట్‌లో తక్కువ ధర లభించినప్పుడు రైతుసేవా కేంద్రాల వద్ద సీఎంఏపీపీలో రిజిస్ట్రేషన్ చేయించుకుని మండలానికి కేటాయించిన పీఏసీఎస్‌ల వద్ద అమ్ముకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం క్వింటాలు కందులు రూ.7,550లు, శనగలు రూ.5,650లు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.

నేడు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంభం : కంభం మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆ మేరకు కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

పుల్లలచెరువు : 2024-25లో కంది సాగు చేసిన రైతులు ఈ నెల 24వ తేదీ నుంచి అమ్ముకోవచ్చునని ఏవో పి.నిర్మలాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుల్లలచెరువు పీఏసీయస్ ద్వారా మార్కుఫెడ్ ఆధ్వర్యంలో క్వింటా రూ.7550కు కొనుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుటుంబ కలహాలతో ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

మార్కాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. పట్టణ ఎస్సై ఎం.సైదు బాబు కథనం మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా చదలవాడ పద్మజ(52) పనిచేస్తోంది. ఈమె స్థానిక కొండేపల్లి రోడ్డులో నివాసముంటోంది. కొద్ది రోజులుగా ఇంట్లో భార్యాభర్తలు గొడవపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు పద్మజ ఉరివేసుకుంది. సాయంత్రం విషయాన్ని గమనించిన భర్త శ్రీనివాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎస్సై సైదుబాబు పరిశీలించి అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా వాల్వ్ గుంతలు


రత్తయ్య హోటల్ సమీపంలో వాల్వ్ గుంత

పొదిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వీధుల్లో మురుగు కాలువలపై ఏర్పాటు చేసిన వాల్వ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. మురుగు కాలువలు పూర్తిగా నిండిపోయి రహదారులపై నీరు వస్తుండడంతో వాల్వ్‌కు ఉన్న మూతలు తీసి కాలువల్లో నీరు తొలగించారు. కానీ తీసిన వాల్‌ను అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ గుంత ఉన్న విషయం గమనించని ద్విచక్ర వాహనదారులు రాత్రివేళలో వేగంగా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా విశ్వనాథపురం పవర్‌ఆఫీస్ లైన్‌లో, రత్తయ్య హోటల్ సమీపంలో తీసిన వాల్వ్ గుంతలకు మూతలు వేయాలని పలువురు కోరుతున్నారు.


విశ్వనాథపురం పవర్‌ఆఫీస్ లైన్‌లో ఇలా..

వృథాగా పోతున్న నీరు


మెయిన్‌పైపు నుంచి లీకవుతున్న నీరు

కంభం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు నీటి వృథాను ఆపాలని కోరుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు జలవనరుల దినోత్సవాలు జరుపుతుండగా మరోవైపు కంభంకు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ జాయింట్ వద్ద నీరు వృథాగా పోతున్నది. ప్రజలకు నిరంతరం తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ నుంచి రెండు రోజులుగా నీరు వృథాగా పోతున్నది. పంచాయతీ వారు నీరు లీకవుతున్న ప్రాంతంలో మరమ్మతుల కోసం గుంతను కూడా తీశారు. అయితే పనులు పూర్తి చేయలేదు. త్వరగా పనులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు ఉపయోగకరం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని కంభం తహసీల్దార్ వి.కిరణ్ అన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్ వద్ద కేర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ కూలింగ్ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాది కంది నారాయణరెడ్డి, సభ్యులు కె.జాన్ వినయ్ కుమార్, ఫణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా 24న సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 11 నుండి 12 గంటల వరకు 9959225702 నంబరుకు ప్రయాణికులు, ప్రజలు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియచేయాలని కోరారు.

అన్ని రకాల బకాయిలను చెల్లించాలి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి

గిద్దలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావలసిన కరువుభత్యం, పీఆర్‌సీ, పిఎఫ్, ఏపీజీఎల్ఐ క్లోజర్స్ రుణాలు, సరెండర్ లీవ్ లాంటి అన్నిరకాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.జనార్ధన్‌రెడ్డి కోరారు. గిద్దలూరులో ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రాంతీయ విద్యాసదస్సుపై స్థానిక మండల ప్రాథమికోన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాంతీయ విద్యాసదస్సును విజయవంతం చేసిన గిద్దలూరు ఏపీటీఎఫ్ నాయకులను అభినందించారు. అనంతరం జరిగిన యూనియన్ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 2003 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు, గిద్దలూరు జోన్ కన్వీనర్ సుబ్బరాయుడు, కోఆర్డినేటర్లు వెంకటరామిరెడ్డి, మూర్తయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పసుపు రైతులకు అవగాహన


పసుపు రైతులకు అవగాహన కల్పిస్తున్న విష్ణుప్రియ

గిద్దలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లె గ్రామపరిధిలో సాగై కోత దశలో ఉన్న పసుపు పంటను ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ ఆదివారం పరిశీలించారు. పసుపు పంట కోత దశలో ఉన్నందున పసుపు తవ్వడం, ఉడికించి ఎండబెట్టే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. పసుపు మొక్కలు బాగా ఎండి నేలపై వాలిపోయినపుడు పంట కోతకు సిద్ధమైనట్లు గుర్తించాలన్నారు. పంటను తవ్వే రెండు రోజుల ముందు ఆకులు, కాండాలను భూమట్టానికి కోసి వేయాలన్నారు. తరువాత తేలికగా నీరు పెట్టి రెండు రోజుల తరువాత దుంపల తవ్వకం ప్రారంభించాలని సూచించారు. దుంపలు తవ్విన తరువాత వాటికి అంటి ఉన్న మట్టిని తొలగించాలని, తవ్వి తీసిన 2 నుంచి 7 రోజుల్లోపల ఉడకపెడితే పసుపు నాణ్యత చెడిపోకుండా ఉంటుందని తెలిపారు.

గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

కొమరోలు, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30 లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపులోడ్ వినియోగించుకున్న వారికి 50శాతం రాయితీని ఇస్తున్నామని కొమరోలు విద్యుత్ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకుందాం అనుకునే గృహవినియోగదారులకు 50శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సాధారణంగా ఒక కిలోవాట్ లోడు క్రమబద్ధీకరణ కోసం గృహ వినియోగదారులు డెవలప్‌మెంట్ చార్జీల కింద విద్యుత్ శాఖకు రూ. 2వేలు చెల్లించాల్సి ఉంటుందికానీ ప్రస్తుతం వెయ్యి రూపాయలు మాత్రమే వినియోగదారుడు చెల్లిస్తే సరిపోతుందన్నారు. వివరాలకు సమీపంలోని లైన్‌మెన్‌ను గాని, విద్యుత్ సబ్‌స్టేషన్ కొమరోలు సంప్రదించి 50శాతం రాయితీని పొందాలని తెలిపారు.

ముఖాముఖి

పశుపోషకులకు మెరుగైన సేవలు

ఎం.విజయలక్ష్మి పశువైద్యాధికారి, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో పశుపోషకులకు ఎలాంటి సేవలే చేస్తున్నారు?

జవాబు: పశుపోషకులకు ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి పథకాన్ని అందిస్తున్నాం. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నాం. మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నాం. ఊరూర పశుగ్రాస క్షేత్రాలు లాంటి పథకాలను అందజేస్తున్నాం.

ప్ర: పశుగ్రాసం కొరత ఉందా?

జ: పశుగ్రాసం కొరత తీర్చేందుకు ఉపాధి హామీ పథకం నిధులతో పశుగ్రాస క్షేత్రాలు మంజూరు చేయిస్తున్నాం. పది సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు మంజూరు చేస్తున్నాం. ఒక్కో పశుగ్రాస క్షేత్రానికి రూ.32,992 మంజూరు చేయిస్తున్నాం.

ప్ర: పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారా?

జ: రేషన్ కార్డు కలిగిఉన్న పశుపోషకులు ఒక్కో గేదెకు రూ.390 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1530 చెల్లిస్తుంది. గేదె చనిపోతే రూ.30వేలు ఇన్సూరెన్స్ లభిస్తుంది. ఈపథకం మూడు సంవత్సరాలు అమల్లో ఉంటుంది. గొర్రెలకు రూ.40 చెల్లిస్తే రూ.6వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.

ప్ర: పశువులకు సంభవిస్తున్న వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నారా?

జ: పశువులకు గాలి కుంటు టీకాలు, నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల దూడలకు బ్రూసల్లా టీకాలు వేయిస్తున్నాం. ఏప్రిల్‌లో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తాగిస్తాం. ఇటీవల గ్రామాల్లో పశు ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటుచేసి పశుపోషకులకు అవగాహన కల్పించాం.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో గల గంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి చల్లంగా చూడమ్మ తల్లి అని వేడుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చక పూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్ర నామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూమనపల్లి కాలనీలో తాగునీటి సమస్య

దొనకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూమనపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు ఎన్‌ఏపీ సిబ్బంది నిర్లక్ష్యంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌ఏపీ పైపులైను పగిలి గత 15 రోజులుగా నీరు వృథాగా పోతున్నా సిబ్బంది పట్టించుకోవడంలేదు. ఎన్‌ఏపీ సిబ్బంది నిర్లక్ష్యంతో కాలనీలో నివసించే దాదాపు వంద కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి

తాళ్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు తప్పక ఈకేవైసీ చేయించుకోవాలి తహసీల్దార్ కె.సంజీవరావు పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవారు ఈనెల 31లోగా రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే సంక్షేమ పథకాల అందకపోవటంతో పాటు, ఏప్రిల్ 1వతేదీ నుంచి రేషన్ నిలుపుదల చేస్తారని తెలిపారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కనిగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి నుంచి మానసిక ప్రశాంతతో కూడిన విద్యాబోధన మంచి ఫలితాలనిస్తుందని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. శనివారం రాత్రి జరిగిన స్థానిక బోధిదర్మ పబ్లిక్ స్కూల్ 6వ వార్షికోత్సంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. ఎంఈవో యువీ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభాపాటవాలు చూపాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- మరమ్మతులకు గురై మూలనపడ్డ ట్రైసైకిళ్లు
- వినియోగంపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం



దొనకొండలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

దొనకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తను సేకరించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గ్రామ పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్న ఉద్దేశంతో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈకార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఈమేరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో లక్షల రూపాయలు ఖర్చుచేసి చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలను చేపట్టింది. హరిత రాయబారులను నియమించి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా కేంద్రాలకు తరలించేందుకు ట్రైసైకిళ్లను కూడా సమకూర్చారు. ఈచెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారుచేసి గ్రామ పంచాయతీలకు కొంతమేర ఆదాయం చేకూర్చేలా కార్యాచరణ రూపొందించారు.

ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోలేదు. ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. దీంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దొనకొండలోని చెత్త సంపద కేంద్రానికి ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి మంజూరుచేసిన ట్రైసైకిళ్ల మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. విలువైన మిషనరీలకు చెందిన కరెంట్ మోటార్లు మాయమై విడిభాగాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పలు కేంద్రాల్లో హరిత రాయబారులకు వేతనాలు మంజూరుకాక విధులకు దూరమయ్యారు.

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు కార్యాచరణను సిద్ధం చేసేందుకు అడుగులు ముందుకు వేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో వర్మీ కంపోస్టు ఎరువుల వినియోగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఈక్రమంలో చెత్త సంపద కేంద్రాల్లో సేంద్రియ ఎరువును తయారుచేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.



మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డ ట్రైసైకిళ్లు

త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించాలి

- ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు



విద్యుత్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

పీసీపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు అవసరమైన విద్యుత్ సౌకర్యాన్ని త్వరితగతిన కల్పించాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండలంలోని దివాకరపల్లి సమీపంలో ఏప్రిల్ 2న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ జరగనుంది. ఈకార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని తనయుడు అనంత్ అంబాని, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తదితరులు పాల్గొననున్నారు. భూమి పూజకు గడువు సమీపిస్తున్నకొద్దీ వివిధశాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సూచనలకు అనుగుణంగా వేగవంతం చేశారు.

ఆదివారం విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు బయోగ్యాస్ ప్లాంట్‌కు కేటాయించిన భూమిని టెక్నికల్ డీఈ వీరయ్యతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ రిలయన్స్ కంపెనీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని వారు సూచించిన ప్రాంతం వరకు స్తంభాలు వేసి వెంటనే వారికి అవసరమైన విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని ఏఈ లక్ష్మీ రాజేష్‌ను ఆదేశించారు. వీవీఐపీల కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌లకు దూరంగా విద్యుత్‌లైనును ఏర్పాటు చేయాలని సూచించారు.

దివాకరపల్లి గ్రామంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను వెంటనే తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని ఏఈని ఆదేశించారు. ప్రతిరోజు సంబంధిత కంపెనీ ప్రతినిధులకు అందుబాటులో ఉండి వారి సూచనల మేరకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పనిచేయాలన్నారు. భూమిపూజ రోజు నాటికి లైన్లు మొత్తం ఒకసారి పరిశీలించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఉమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో క్వార్టర్లు

- తుప్పుపడుతున్న సామగ్రి
- పట్టించుకోని అధికారులు



చిల్లచెట్లలో శిథిలావస్థకు చేరిన ఎన్ఏపీ క్వార్టర్

దర్శి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో ఎంతోకాలంగా పాత మెటీరియల్ నిరుపయోగంగా పడిఉంది. తుప్పుపట్టిపోతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. ఎంతోకాలంగా కాలనీ గురించి పట్టించుకోపోవటంతో చిల్లచెట్లు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పైపులైన్ల నిర్మాణం సమయంలో మిగిలిన మెటీరియల్‌ను, తర్వాత మార్పుచేసిన మెటీరియల్‌ను కార్యాలయం ఆవరణలో నిల్వ ఉంచారు. ఇనుము, ప్లాస్టిక్ పైపులు ఎన్నో సంవత్సరాలుగా గుట్టలుగా పడి ఉన్నాయి. నిల్వ ఉన్న మెటీరియల్ సంరక్షణ గురించి పట్టించుకోపోవటంతో తస్కరిస్తున్నారు.

అలాగే, క్వార్టర్స్ గురించి పట్టించుకోకపోవటంతో తలుపులు, కిటికీలు, ఇతర మెటీరియల్ శిథిలమైపోతున్నాయి. క్వార్టర్స్ పనికిరావనే ఉద్దేశంతో వదిలేశారు. వీటిని కూల్చేసి మెటీరియలను భద్రపరచవలసిన అవసరం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాత మెటీరియల్‌ను వేలం వేస్తే లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. వేలంకు పెడితే నిల్వ ఉన్న మెటీరియల్ లెక్క చెప్పాల్సి వస్తుందనే ఉద్దేశంతో అధికారులు ఆ విషయం గురించి పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మెటీరియల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఇనుపపైపులు

గ్రాసం లేక వలసలు

కరిచేడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం, నీటి వసతి లేక జీవాలు వలసపోతున్నాయి. యర్రగొండపాలెం తండాకు చెందిన 1500 వందల ఆవులు ఆదివారం కరిచేడు మీదుగా వెళ్తున్నాయి. ఈవిధంగా వలస పోవడం ఈమధ్యకాలంలో నిత్యం కనపడుతున్నది. తెనాలి, రేపల్లె ప్రాంతాలలో గడ్డి, నీరు దొరుకుతుందని అక్కడకి వెళుతున్నట్లు యజమానులు తెలిపారు. జూన్, జూలై ప్రాంతాలలో వర్షాలు పడితే ఆగస్టు నాటికి గడ్డి మొలుస్తుందని , అప్పుడు స్వగ్రామాలకు వస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఏడు కుటుంబాలకు చెందిన 1500కు పైగా ఆవులు కరిచేడు మీదుగా వెళ్ళాయి.



గ్రాసం లేక వలసపోతున్న ఆవులు

భక్తి శ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 23(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం స్వామి వారికి మహానైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణి చేశారు. గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

పీసీపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పెదయిర్లపాడులో ఆదివారం రాత్రి జరిగిన బోధి మోడల్‌స్కూల్ 15వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్తుకు బంగారుబాట అవుతుందన్నారు. కార్యక్రమంలో వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, జడ్పీటీసీ లక్ష్మీకాంతం, ఒంగోలు అమ్మ హాస్పిటల్ డాక్టర్ కోటపాటి నరసింహం, ఎంపీటీసీ రమణమ్మ, కరస్పాండెంట్ కరణం గంగయ్య, ప్రిన్సిపాల్ గీతాప్రసన్న, కరణం తిరుపతిరావు, వేమయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గ్రామ సచివాలయాలు

- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- అద్దె భవనాల్లో కొనసాగుతున్నవైనం
- చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ముండ్లమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో అద్దె భవనాల్లో చాలిచాలనీ వసతులతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మించేందుకు గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కాంట్రాక్ట్ దక్కించుకొని పనులు మొదలుపెట్టారు. కొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలివేశారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019లో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ఒకేచోట గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించేలా ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరుచేసింది. సచివాలయాలకు రూ.35 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు రూ.18 లక్షల నుంచి రూ.21 లక్షల ఉపాధి నిధులను మంజూరు చేసింది.

ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, శంకరాపురంలో గ్రామ సచివాయాలు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఉమామహేశ్వర అగ్రహారంలో రైతు భరోసా కేంద్రం పిల్లర్స్‌కే పరిమితమైంది. పసుపుగల్లులో రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం అసంపూర్తిగా ఉన్నాయి. సింగనపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి అసంపూర్తి భవనాలను పూర్తిచేయించాలని పలువురు కోరుతున్నారు.



ఉమామహేశ్వర అగ్రహారంలో పిల్లర్స్‌కే పరిమితమైన రైతు భరోసా కేంద్రం



పూరిమెట్లలో అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దర్శి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పువెంకటాపురం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.వీరబ్రహ్మం(60) అనే వ్యక్తి మృతిచెందాడు. ఆగ్రామానికి చెందిన వీరబ్రహ్మం ప్రతిరోజు దర్శికి వచ్చి కార్పెంటర్ పనిచేసుకొని ఇంటికి వెళ్తుండేవాడు. అదేక్రమంలో ఆదివారం పని చూసుకొని ఆటోలో ఇంటికి బయలుదేరాడు. తూర్పువెంకటాపురం సమీపంలోకి వెళ్లేసరికి అతివేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో వీరబ్రహ్మం అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ పరారయ్యాడు. ఆటోలో ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉన్నారు. ఎక్కువ మంది ఉండిఉంటే మరింత ప్రాణనష్టం జరిగేది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కనిగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జననీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరానికి ఆదివారం విశేష స్పందన లభించింది. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన ఈ శిబిరంలో కంటి సంబంధ బాధితులు పెద్దఎత్తున వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ అపర్ణలు కంటి వైద్య పరీక్షలు చేశారు. నేత్రవైద్య శిబిరంలో 328 మంది కంటి పరీక్షలు చేంయించుకోగా, వారిలో 180మందికి ఆపరేషన్‌లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆదివారం 43 మందిని కంటి ఆపరేషన్‌ల కోసం గుంటూరు శంకర కంటి వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఈనెల 25న 73 మందిని, 27న 64 మందిని ఆపరేషన్‌లకు తరలించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు తెలిపారు. వైద్య శిబిరంలో వలంటీర్లుగా టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు విశేష సేవలు అందించారు.

వచ్చేనెల 15వరకు సాగర్ జలాలు విడుదల చేయాలి

ముండ్లమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలో సాగుచేసిన వరి పైరు రైతులకు దక్కాలంటే ఏప్రిల్ 15 వరకు సాగర్ జలాలు విడుదలయ్యే విధంగా చూడాలని సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతారావును డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు ఆదివారం సత్తెనపల్లిలో ఆయనను కలిసి రైతుల ఇబ్బందులను వివరించారు. ప్రస్తుతం మేజరు పరిధిలో వెయ్యి ఎకరాలు వరి పైరు పొట్ట దశలో ఉందని తెలిపారు. ప్రస్తుతం వారాబందీ విధానంతో సాగర్ జలాలు సరఫరా అవుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ 15 వరకు నీరు విడుదల చేస్తే వరి పంట దక్కుతుందని డీసీ చైర్మన్ శ్రీనివాసరావు ప్రాజెక్టు చైర్మన్ కాంతారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈసమస్యను జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

26న టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పామూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి టీడీపీ ముస్లిం నాయకులకు సూచించారు. కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పామూరుకు చెందిన నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. పామూరులో ఈనెల 26న టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందులో పాల్గొనాలని కోరగా, తప్పక హాజరవుతానని డాక్టర్ ఉగ్ర తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టీడీపీ ముస్లిం నాయకులు షేక్ షంషూర్, ఆర్ఆర్ రఫీ, షేక్ ఖాజారహంతుల్లా, షేక్ గౌస్‌బాషా, ముబీనామౌలాలి, షేక్ పులినాయబా, హాజీగౌస్, పత్తు మస్తాన్, బాదుల్లా, మాచర్ల రహిమాన్, సయ్యద్ ఖాదర్‌బాషా, వై.అస్లీం, సుభాని తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పామూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పామూరు పోలీస్ స్టేషన్‌ను కనిగిరి డీఎస్పీ సాయి ప్రతాప్ యశ్వంత్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్పీ రికార్డుల తనిఖీ సమయంలో సీఐ, ఎస్‌లు అందుబాటులోలేరు. డీఎస్పీని కలిసిన విలేకరులతో మాట్లాడుతూ పామూరులో శనివారం జరిగిన పలు దొంగతనాలపై దర్యాప్తు జరుగుతుందన్నారు. ప్రజలు కూడా అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పామూరులో పట్టపగలే చోరీలు

పామూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పామూరులో పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఎన్జీవో కాలనీలోని బచ్చల కోటేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి తాళాలు పగులకొట్టి రూ.2 లక్షల నగదు, 12 సవర్ల బంగారం దోచుకెళ్లినట్టు బాధితుడు తెలిపారు. నేతాజీనగర్‌లో మాజీ సర్పంచ్ గురుస్వామి ఇంటి తాళాలు పగులకొట్టి 64 గ్రాముల బంగారం, నగదు అపహరించారు. రమణారెడ్డి ఇంట్లో రూ.18వేలు నగదు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.కిశోర్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవసరాన్ని బట్టి కియోస్క్ యంత్రాలను వినియోగిస్తున్నాం

తాళ్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలను అవసరాన్ని బట్టి వినియోగిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. 'నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కియోస్క్ యంత్రం ద్వారా బుక్ చేసేవిధానం సెల్‌ఫోన్‌లోనూ అందుబాటులో ఉందని ఏవో ప్రసాదరావు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏలు ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు ఇండెంట్లు పెడుతున్నట్టు చెప్పారు. అవసరాన్ని బట్టి కియోస్క్ యంత్రాలను వినియోగిస్తున్నామన్నారు.

రేపు తాళ్లూరు మండల సమావేశం

తాళ్లూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల పరిషత్‌సర్వసభ్య సమావేశం ఈనెల 25 వతేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

కొవ్వొత్తులతో భగత్‌సింగ్‌కు నివాళి




కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కనిగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఉరికంబాన్నే ముద్దాడిన వీరకిశోరం భగత్‌సింగ్ అని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కేవీ పిచ్చయ్య, జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి కనిగిరిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సుగుణావతమ్మ సెంటర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో ప్రమాదకర చట్టాలకు వ్యతిరేకిస్తూ భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని పోరాడిన వీరుడు భగత్‌సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, రవి, నెహమ్మత్, గణేష్, నరేష్, డేవిడ్ తదితరలు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్‌కు సీపీఐ నాయకలు నివాళులర్పించారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా స్థానిక కందుకూరు రోడ్డులోగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ నాయకుడు వజ్రాల సుబ్బారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో తెల్లవారికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు నిజమైన దేశభక్తులని కొనియాడారు. కార్యక్రమంలో షేక్ రఫీ, రాగిపాటి సూరిబాబు, ఇర్రి వెంకటరెడ్డి, పి.రఘు నాథరెడ్డి, ప్రసాద్, ఆంజి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఊసా రాజ్యలక్ష్మి, ఎస్.తిరుపతిరెడ్డి, ఇర్ల కొండయ్య, ఎన్.వెంకట్రామయ్య, గుర్రం లక్ష్మయ్య, నరసింహులు, ఎస్.పెద్దయ్య పాల్గొన్నారు.





విస్తృతంగా... నీటి కుంటలు

- ఉపాధి హామీ పథకం కింద పనులు
- 32 వేల నీటి కుంటల నిర్మాణ లక్ష్యం
- ప్రతి గ్రామానికి పది చొప్పున మంజూరు
- రైతులకు మేలు చేసేలా నిర్మాణం
- వేసవిలో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- బాపట్ల జిల్లా ముందంజ.. పూర్తిగా వెనుబడిన పల్నాడు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం నడుంకట్టింది. వేసవిలో ఉపాధి కూలీలకు పనులు పెద్దఎత్తున కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ రెండు లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మేలు చేసేలా విస్తృతంగా సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేపడుతోంది. ఈ పనులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి నిధులను కేటాయించింది. ప్రతి గ్రామ పరిధిలో కనీసం 10 నీటి కుంటలు నిర్మించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 32 వేలు నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ వ్యయం రూ.137.60 కోట్లు అవుతుందని అంచనా వేశారు. నీటి కుంటల నిర్మాణంలో బాపట్ల జిల్లా ముందంజలో ఉండగా పల్నాడు జిల్లా పూర్తిగా వెనుబడి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి కుంటల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పనులకు తిలోదకాలు ఇచ్చారు. వర్షాలు కురిసిన సమయంలో నీటి కుంటల్లో నీటిని నిల్వ చేసి ఆ తదుపరి పంటలకు వినియోగించుకునే విధంగా వీటి నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు రైతులను గుర్తిస్తున్నారు. పొలంలో నీటి కుంట నిర్మాణానికి అంగీకరించేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. నీటి కుంటల వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించి నీటి కుంటల పథకాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. వేసవిలో ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కాలంలో వ్యవసాయ పనులు ఉండవు. దీంతో ఉపాధి కార్మికులకు వారి గ్రామంలోనే నీటి కుంట పనులు కేటాయించి వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు పెరుగుతాయని అంచనా వేస్తు న్నారు. నీటి కుంటల నిర్మాణంపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తు న్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పెద్దఎత్తున నీటి కుంటల నిర్మాణాలకు రైతులు శంకుస్థాపనలు చేయగా అధికారు లు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


రొంపిచర్ల : విప్పర్లపల్లిలో శనివారం నీటి కుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

పనులు ఇలా..

- పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటికి 2,540 మంజూరు చేశారు. వీటిలో 850 కుంటల పనులు చేపట్టగా 87 పూర్తియ్యాయి. 3.43 శాతం పనులు పూర్తి చేసినట్లు డ్వామా అధికారులు తెలిపారు.
- గుంటూరు జిల్లాలో 8,500 నీటి కుంటల నిర్మాణం లక్ష్యం కాగా 584 చేపట్టి 113 పనులను పూర్తి చేశారు. నీటి కుంటల నిర్మాణం 19.35 శాతంగా నమోదైంది.
- బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 1,752 పనులు చేపట్టారు. 466 పనులు పూర్తి చేయగా 26.60 శాతం నమోదైంది.

విద్యుత్.. ఊరట

విద్యుత్ భారంతో సామాన్యులు సతమతమవుతున్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్త విధానాలతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ క్రమంలో సామాన్యులకు విద్యుత్ భారం నుంచి ఊరట కలిగేలా ప్రభుత్వం పలు నిర్ణ యాలు ప్రకటించింది. అనేక రూ పాల్లో వారికి రాయితీలు అందిం చి ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే ట్రూడౌన్ చార్జీలు తగ్గించి స్వల్ప ఉపశమనం కల్పించిన ప్రభు త్వం విద్యుత్ భారాన్ని పూర్తిగా తొలగించే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీల కు మాత్రమే ఉచిత విద్యుత్ అందుతుండగా ఇక నుంచి నేత కార్మికులకు కూడా ఆ అవకాశాన్ని అందిం చేందుకు ప్రభు త్వం కార్యాచరణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం సూర్య ఘర్ పథకానికి సంబంధించి బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సబ్సిడీని ప్రకటించింది.

- బడుగులకు బాసటగా నిర్ణయాలు
- విద్యుత్ భారం తగ్గింపునకు చేయూత
- నేతన్నలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- గుంటూరు, పల్నాడు, బాపట్లలో 31 వేల మందికి లబ్ధి
- సోలార్ విద్యుత్‌పై బీసీలకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ

గుంటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా విద్యుత్ భారంతో అల్లాడిన బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు పలు రూపాల్లో ఉపశమన చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయనున్నది. ఈ ఉచిత విద్యుత్ స్కీము ద్వారా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో చేనేత కార్మికులు ప్రయోజనం పొందనున్నారు. గుంటూరు జిల్లాలో 11 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వేసిన లెక్కల ప్రకారం ఈ సంఖ్య 20వేల లోపు మాత్రమే ఉంది. నేతన్న నేస్తం భారం తగ్గించుకోవడానికి నిబంధనల పేరుతో నేతన్నల సంఖ్యను భారీగా తగ్గించింది. ఆ కారణంగా నాడు అనేక మంది నేతన్న నేస్తం ప్రయోజనాన్ని కోల్పోయారు. నేడు ఉచిత విద్యుత్ ప్రయోజనానికి దూరమయ్యే ప్రమాదమూ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేసి అర్హులైన నేతన్నలందరికీ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తామని చెబుతోంది. కాగా మూడు జిల్లాల్లో పవర్‌లూమ్ మగ్గాలు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. వారికి నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తారు.

● సూర్యఘర్‌కు మరింత సబ్సిడీ..

పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం కేంద్రం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు ఇప్పటికే 2 కిలో వాట్ల సోలార్ ప్లాంట్లను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న ప్రభుత్వం, బీసీ వర్గాలకు అదనపు సబ్సిడీని ప్రకటించింది. డ్వాక్రా గ్రూపు మహిళల్లో అవగాహన కల్పిస్తూ, వారిని సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే దిశగా ప్రోత్సహిస్తున్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి 2 కిలో వాట్ల ప్లాంటు ఏర్పాటుకు రూ.లక్షా 20 వేలు ఖర్చవుతుంది. అందులో కేంద్రం రూ.60 వేలు సబ్సిడీగా ఇస్తోంది. ఈ సబ్సిడీకి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అదనంగా మరో 20 వేలు సబ్సిడీ ఇస్తోంది. దీంతో రూ.30, 40 వేల రుణంతో బడుగులు సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో 10 లక్షల కుటుంబాల వరకు ఈ ప్రయోజనం కలిగే వీలుంది. పక్కా ఇల్లు ఉన్న వారిని ప్రోత్సహించేందుకు డ్వాక్రా సంఘాలను భాగస్వాములను చేశారు. మహిళల్లో అవగాహన కల్పించి గ్రూపుల ద్వారా రుణాలు అందించి సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు కృషి చేస్తున్నారు. సొంత ఇళ్లు లేనివారికి ప్రభుత్వం ఇచ్చే ఇళ్లతోపాటు సోలార్ ప్లాంటును కూడా అనుసంధానం చేస్తే మరింత ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుంది.

30న అమరావతిలో పీ-4 ప్రారంభోత్సవం

ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తుళ్లూరు(వెలగపూడి), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ప్రజలు, ప్రైవేటు భాగస్వామ్యం పీ4 ప్రారంభ కార్యక్రమాన్ని 30న ఉగాది రోజున సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. రాజధాని అమరావతి వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి వెలగపూడి అసెంబ్లీ సచివాలయం వెనక 50 ఎకరాలను ఎంపిక చేయగా ఇక్కడ ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం ఆయా పనులను గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. అంతక ముందు సచివాయంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే కలెక్టర్ల సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన నాగలక్ష్మి అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే నెల మూడో వారంలో ప్రధాని మోదీ రాజధాని పనులకు శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సచివాలయం ఒకటో భవనం వెనక ఈ-6, ఎన్-9 రోడ్డు జంక్షన్‌లో 200 ఎకరాల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయ్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హార్బర్‌లో.. పనులు పరుగు

- నిజాంపట్నంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి
- సైడ్ రివిట్‌మెంట్ నిర్మాణాలు 70 శాతం పూర్తి
- పనులపై పది నెలలుగా మంత్రి అనగాని సమీక్షలు

రేపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రచారానికే పరిమితమైన నిజాంపట్నం హార్బర్ పనులు గత పది నెలలుగా పరుగులు తీస్తు న్నాయి. గత ప్రభుత్వం హార్బర్‌పై దృష్టి సారించకపో వడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు కింద 2022లో హార్బర్‌కు విస్తరణ నిర్మాణ పనులకు రూ.451 కోట్లు నిధులు కేటాయించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర పర్యావరణ అనుమతులు పొందకుండా హడావుడిగా పనులు శ్రీకారం చుట్టింది. అనుమతులు లేకపోవడంతో సగంలోనే నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హార్బర్ అభివృద్ధిపై హామీలు ఇచ్చారు. తీరప్రాంతం నుంచి భారీగా మత్స్య ఎగుమతులు ఉత్పత్తి చేస్తామన్నారు. తాము అధికారంలోకి రాగానే హార్బర్ నిర్మాణం చేపట్టి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకులు హార్బర్‌లో పనులను వేగవంతం చేశారు. గత పదినెలలుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ హార్బర్ నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు అటు అధికారులతో ఇటు కాంట్రాక్టర్లతో సంప్రదింపులు చేస్తు న్నారు. త్వరితగతిన పూర్తిపై సమీక్షిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. అదేవిధంగా హార్బర్ అభివృద్ధిపై కేంద్ర మత్స్య శాఖామంత్రితో మంత్రి అనగాని ప్రత్యేకంగా సంప్రదిస్తున్నారు. జెట్టీ విస్తరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన రిజర్వు భూమిని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖతో అనుమతులు పొంది పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ నిధులపై నివేదిక ఇచ్చి త్వరితగతిన హార్బర్ అభివృద్ధి పనులు పూర్తికి కేంద్ర సహాయాన్ని కూడా అనగాని కోరారు. ఈ పరిస్థితుల్లో హార్బర్‌లో సైడ్‌రివిట్‌మెంట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. హార్బర్‌కి రెండువైపులా సైడ రివిట్‌మెంట్ నిర్మాణాలు 70 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.


హార్బర్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రిటైనింగ్‌వాల్


సముద్రం అంచున కోతకు గురికాకుండా వేసిన బండలు


హార్బర్‌లో చురుగ్గా సాగుతున్న సైడ్ రివిట్‌మెంట్ పనులు

1న పర్చూరుకు సీఎం చంద్రబాబు

- పేదల సేవలో.. పేరిట పింఛన్ల పంపిణీ
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1న పర్చూరు నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పాల్గొనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి పేదల సేవలో.. అని నామకరణ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు స్వయంగా నగదు పంపిణీ, ప్రజావేదిక, రాజ కీయ సమా వేశం, చివరిగా అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు విధుల కేటాయింపుపై డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో సీపీవో శ్రీనివాసరావు, డీపీవో ప్రభాకరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డీఎల్‌డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్..

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ద్వారా నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ తెలిపారు. అగ్నిజనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్‌కీపర్, టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్ విభాగాలలో ఉద్యోగ నియామకాలు జరుగుతాయన్నారు. అర్హులైన యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని తెలిపారు. రాతపరీక్ష మొదటిసారిగా తెలుగులో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు, క్రీడాకారులకు ప్రత్యేక బోనస్ మార్కులు ఉంటాయని తెలిపారు. ఐటీఐ, డిప్లమో చేసిన వారు అగ్నిటెక్నికల్ విభాగానికి అర్హులన్నారు. ఆసక్తిగల యువకులు ఏప్రిల్ 10 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అసైన్డ్‌భూములలో అక్రమంగా లాడ్జిల నిర్మాణం

బాపట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పర్యాటకుల అవసరాన్ని గుర్తించి కొంతమంది వ్యాపారులు అసైన్డ్‌భూములను కొనుగోలు చేసి మరికొందరు లీజుకు తీసుకుని ఇంకొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అక్రమ కట్టడాల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే అనేక లాడ్జిలు ఇక్కడ వెలిశాయి. పర్యాటకేంద్రంగా ప్రసిద్ధిగాంచిన ఈప్రాంతంలో ప్రభుత్వం లాడ్జిలను అందుబాటులోకి తీసుకురాకపోవటం ప్రైవేట్ లాడ్జిలవైపు చూస్తున్నారు. దీనిని వ్యాపారంగా మల్చుకుని అనేకమంది అక్రమంగా లాడ్జిలు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇదేప్రాంతంలో మరో లాడ్జి నిర్మాణం చేపట్టటంతో స్థానికులు నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. అయినప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటంలేదు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి విజయసారథిని వివరణ కోరగా తొలుత ఇసుక పక్కకు వెళ్ళిపోతుందని చెప్పి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్న వ్యక్తులు ఆదివారం సెలవు కావటంతో నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిసిందన్నారు. వెంటనే వెళ్ళి నిర్మాణాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

కొనుగోళ్లు ఫుల్... ధరలు డల్

- మిర్చికి గుంటూరు ఏఎంసీలో పెరగని ధర
- మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ధరకి అటు ఇటుగానే రైతుకు చెల్లింపు
- ఎక్స్‌పోర్టు డిమాండ్ ఉన్నప్పటికీ ఎందుకు రేటు రావడం లేదో?

గుంటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గత రెండున్నర నెలల నుంచి మిర్చియార్డులో వాణిజ్యం జరిగిన ప్రతీ రోజు లక్షా 20 వేల టిక్కీలు చొప్పున కొనుగోళ్లు జరుగుతూనే ఉన్నాయి. వీటిల్లో ఎక్స్‌పోర్టు వెరైటీ అయిన తేజ 50 శాతం పైగానే మార్కెట్‌ని ఆక్రమిస్తున్నది. నిత్యం చెన్నై పోర్టుకి ఇక్కడి నుంచి కంటైనర్లు బయలుదేరి వెళుతున్నాయి. దేశీయంగా ఎర్రరంగు కారం కోసం వినియోగించే 341 వెరైటీకి మంచి డిమాండ్ ఉన్నది. బ్యాడిగి, షార్క్ వంటి రకాల మిర్చిలు కూడా అమ్ముడౌతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే మిర్చికి డిమాండ్ ఉందన్న విషయం సుస్పష్టం. అయినప్పటికీ రైతు ఆశించిన ధర రావడం లేదు. క్వింటాల్ రూ.11,500లకు అటు ఇటుగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి. గతంలో డిమాండ్ ఉంటే రేటు పెరిగేది. అలాంటిది ఈ ఏడాది సీజన్ మొదలుకుని ధర ఒకే విధంగా స్థిరంగా కొనసాగుతుండటం ఎవ్వరికీ అంతుచిక్కడం లేదు. ఫలాన కారణం వలన రేటు పెరగడం లేదని అటు మార్కెటింగ్ అధికారులు, ఇటు మిర్చి వర్తకులు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు.

ఈ ఏడాది మిర్చి సీజన్ జనవరి నెలలో సంక్రాంతి పండగ తర్వాత ప్రారంభమైంది. ప్రతీ శని, ఆదివారం, పండగ రోజు సెలవుదినాలు తీసేస్తే దాదాపుగా 50 రోజులకు పైగానే మిర్చియార్డులో వాణిజ్యం జరిగింది. ఈ నేపథ్యంలో 60 నుంచి 65 లక్షల మిర్చి టిక్కీల వరకు విక్రయాలు జరిగాయి. అధికారిక గణాంకాల ప్రకారం యార్డులో ప్రస్తుతానికి 51 వేల మిర్చి టిక్కీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌లలో 60 శాతం మేరకు ఖాళీ ఉన్నది. చెన్నై నుంచి నిత్యం కంటైనర్లు వచ్చి లోడింగ్ చేసుకోవడాన్ని పరిశీలిస్తే చైనాకు ఎగుమతులు ఆశాజనకంగానే ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు మిర్చిని ఇక్కడికి తీసుకొస్తున్నారంటే కొనుగోళ్లు జరుగుతుండటం వలనేనన్న విషయం తేలిపోతున్నది. మిర్చికి ఉన్న డిమాండ్‌ని ఈ పరిణామాలు, పైన పేర్కొన్న గణాంకాలే కళ్లకు కడుతున్నాయి. ఇంత డిమాండ్ ఉంటే ధర కనీసం క్వింటాల్‌కు రూ. 16 వేలు దాటిపోవాలి. అలాంటిది రూ. ఐదు వేలు తక్కువగా రూ. 11 వేల వద్ద ఊగిసలాడుతున్నది.

వ్యాపారస్థులు, అధికారుల అభిప్రాయం ఇలా...

గత రెండేళ్లలో మిర్చికి అధిక ధర వస్తుందని ఆశించి రైతులు, వ్యాపారస్థులు మిర్చిని కొనుగోలు చేసి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. అయితే వారి అంచనాలకు విరుద్ధంగా మార్కెట్ పెరగలేదు. ఈ అనుభవంతో ప్రస్తుత సీజన్‌లో రైతులెవ్వరూ కూడా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వచేసి ధర పెరగడాని కోసం ఎదురు చూడటం లేదు. వ్యాపారస్థులు కూడా పెద్దగా స్టాకు పెట్టుకోవడం లేదు. ఈ కారణాలతోనే ధరలు పడిపోయాయని వ్యాపారస్థులు, అధికారులు ఒక అంచనాకొచ్చారు.

మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ అమలు చేయలేని పరిస్థితి

మిర్చికి ధర పడిపోవడంతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీం కింద మిర్చి కనీస మద్దతు ధరని రూ. 11,781గా నిర్ణయించింది. అయితే ఇందుకు పలు నిబంధనలను పొందుపరిచింది. ఈ-క్రాప్‌లో రైతు పేరు, విస్తీర్ణం, మిర్చి సాగు చేసిన వెరైటీ తప్పక నమోదై ఉండాలని స్పష్టం చేసింది. అలానే తేమ శాతం, మిరపకాయల పొడవు ఎంత ఉండాలి వంటి నిబంధనలు పెట్టడంతో రైతులు ఆ స్కీమ్ గురించి పట్టించుకోవడం లేదు. మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో తమకు క్వింటాల్ రూ. 11,500 ధర వచ్చినా చాలన్న ధోరణితో విక్రయించేస్తున్నారు.


చెన్నై నుంచి వచ్చిన కంటైనర్‌కి చైనాకి ఎగుమతి అయ్యే మిర్చిని లోడింగ్ చేస్తున్న కార్మికులు

అవీ..ఇవీ



ఎస్‌డీసీ విజయజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న మణికేశ్వరం గ్రామస్థులు

ఎస్సీ కాలనీ వాసులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

అద్దంకిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామం అయిన మణికేశ్వరం ఎస్సీలకు నేటికీ ఇంటి స్థలాలు కేటాయించలేదని, వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)ని మణికేశ్వరం ఎస్సీ కాలనీ వాసులు కోరారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు గ్రామస్థులు ఒంగోలులోని ఎస్‌డీసీ కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి 15 సంవత్సరాలు అయిందని, గ్రామంలోని ఎస్సీలకు తప్ప మిగిలిన వారందరికీ కిలో మీటరు దూరంలో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అయితే గ్రామంలో మురుగునీరు, రోడ్లు, కాలువలు వంటివి సక్రమంగా లేక దోమలు పెరిగి వ్యాధుల భయంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు లగ్గిశెట్టి అంజయ్య, మురుకిపూడి దావీదు, షేక్ సుభాని, మందా ఏసురత్నం తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

నల్లబర్లీని కొనుగోలు చేయకుంటే ఉద్యమమే

ఇంకొల్లు,మార్చి 22,(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండు చేశారు. ఇంకొల్లులోని మాదాల అంజయ్య బిల్డింగ్‌లో ఆదివారం జిల్లా స్థాయిలోని పొగాకు రైతులతో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం,బాపట్ల,గుంటూరు జిల్లాలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారని, ప్రభుత్వం రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును బోర్డులు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని లేకుంటే ఉద్యమంతో ముందుకు సాగుతామని అన్నారు. పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండు చేశారు.ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, తల్లపనేని రామారావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న ప్రముఖులతో ప్రతినిధులు

సమాజ సేవకులకు సత్కారం

చీరాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వివిధ ఉద్యోగ బాధ్యతల్లో ఉండి సమాజానికి సేవలందిస్తున్న ప్రముఖులను సత్కరించడం ఆనందంగా ఉందని నరసరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు, సారస్వత భాస్కర బిరుదాంకితులు అప్పాజ్యోస్యుల అన్నారు. ఆదివారం స్థానిక రోటరీక్లబ్ సమావేశం హాలులో బత్తుల సర్వీసు ట్రస్టు ప్రతినిధి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఉగాది పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేషంగా రాణించిన పదిమంది ప్రముఖులకు ఉగాది పురస్కార అవార్డులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, భాగి కృష్ణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, శాస్త్రి, నాగవీరభద్రాచారి తదతరులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వేదపండితులు, పూజారులతో చర్చిస్తున్న ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు

కుంభాభిషేకం విజయవంతానికి ఏర్పాట్లు

అద్దంకి, మార్చి23(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండపం ప్రారంభం, కుంభాభిషేకంను దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఈవో తిమ్మానాయుడు ఆదేశించారు. మే 19 వ తేదీ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం ప్రారంభం, కుంభాషేకం నిర్వహణకు శృంగేరి భారతీ పీఠం పీఠాధిపతి విధుశేఖరభారతీ స్వామి తో పాటు 70 మంది శిష్యబృందం హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను పూజారులు బృందాలుగా పర్యవేక్షించాలన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో చంద్రమౌళీశ్వరపూజ, పాదుకా పూజలు నిర్వహించే వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మారుతీ భవన్‌లో కూడా అవసరమైన అన్ని మార్పులు చేసి సిద్ధం చేస్తామన్నారు. ఈ సమావేశంలో వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, మిగిలిన పూజారులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

బల్లికురవ. మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు చేసుకొనేందుకు ఈనెల 25 వ తేదీ వరకు గడువు పొడిగించారని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. మరిన్ని వివరాలకు గ్రామ సచివాలయాలలో సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు.

కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం

- మార్టూరులో తొలిసారి నిర్వహణ
- భారీగా తరలివచ్చిన ప్రజలు



కల్యాణంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడు

మార్టూరు,మార్చి23 (ఆంధ్రజ్యోతి) :అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్త జనులతో ఆదివారం మార్టూరులోని దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణమండపం కిక్కిరిసిపోయింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా జరిగిన శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా జరగగా, స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తూ భక్తజనులు హృదయాలు ఆనందపరవశంతో పులకరించిపోయాయి. మార్టూరులో శ్రీవేకటేశ్వరస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో తొలిసారిగా స్వామి వారి కల్యాణం నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చారు. రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి వచ్చిన 8 మంది ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో స్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణం జరుగుతున్న సమయంలో ఏడుకొండలవాడా గోవిందా అనే నామస్మరణలతో ప్రజలు మైమరచిపోయారు. దాదాపుగా రెండువేలమందికి పైగా మార్టూరు ప్రజలు స్వామి వారి కల్యాణం తిలకించడానికి వచ్చారు. వారందరికి కల్యాణం జరుగుతున్న సమయంలో మజ్జిగను పంపిణీ చేయడంతో పాటు,కల్యాణం అనంతరం భారీగా అన్నవితరణ చేశారు. మార్టూరు గ్రామానికి చెందిన గ్రానైట్ పరిశ్రమ యజమాని కంభంపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో శ్రీనివాస కల్యాణం నిర్వహించడంతోపాటు,అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ మార్టూరు కమిటీ సభ్యులు సహాయసహకారాలను అందించారు.



స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు

టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు దంపతులకు సత్కారం

తిరుమల దేవాలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులకు షష్టిపూర్తి సందర్భంగా వారి దంపతులకు భక్త సమాజం వారు ఘనంగా సత్కరించారు. స్వామి కల్యాణం పూర్తయిన తర్వాత వేణుగోపాల దీక్షితుల దంపతులను పూలమాలలతో,పట్టు వస్త్రాలతో,శాలువాలతో సత్కరించారు.

అణగారిన వర్గాల అభివృద్ధికి కూటమి కృషి

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అవాంతరాలు ఎన్ని ఎదురైనా అణగారిన వర్గాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు టీడీపీ కూటమి విశేషంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపడంతో ఆదివారం క్యాంపు కార్యాలయంలో మాదిగ సంఘాల నాయకులతో కేక్ కటింగ్ నిర్వహించారు. ముందుగా ఆయా సామాజిక వర్గం నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. కూటమికి, ముఖ్యమంత్రికి జై అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఇటీవల అనారోగ్యం పాలైన టీడీపీ కౌన్సిలర్ మామిడాల రాములును పరామర్శించారు. కీర్తివారి పాలెం సీనియర్ టీడీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసరావు కుమారుడు వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. రామన్నపేటలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అలాగే నాగార్పామ్మ గుడిలో నిర్వహించిన పొంగళ్ల ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అలాగే ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పులి వెంకటరావు దశదిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ హర్షాతిరేకాలు

మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కటింగ్ నిర్వహించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, తేళ్ల రాంబాబు, దుడ్డు వందనం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను గజమాలతో సత్కరిస్తున్న మాదిగ సంఘాల నాయకులు

మనోహర్ మృతి టీడీపీకి తీరని లోటు



మనోహర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంపల్లె గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు బెజ్జం మనోహర్(80)శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మనోహర్ మృతి పట్ల పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మనోహర్ మృతి పార్టీకి తీరనిలోటన్నారు. టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, చింతగుంపల్లె గ్రామ సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ, ఏలూరి క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు కొమ్మినేని వెంకట్, అఖిల్, పలువురు టీడీపీ నాయకులు ఆదివారం మనోహర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల నిరసన ర్యాలీ

పర్చూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం పర్చూరులో మాలలు నిరసన ర్యాలీ చేపట్టారు. వర్గీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత ర్యాలీగా బయలు దేరి పర్చూరు బొమ్మల సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దళితుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. వర్గీకరణ పేరుతో మాలలు, మాదిగల మధ్య చిచ్చుపెట్టే చర్యలకు తెరలేపటం సరికాదన్నారు. నాయకులు వడ్డెముక్కల అబ్రహాం, గేరా స్వరాజ్ కుమార్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రవికుమార్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, టీడీపీ నేతలు

గొట్టిపాటి ఫ్లెక్సీకి పాలాభిషేకం

అద్దంకి, మార్చి23(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలోని 40 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు పంపిణీ చేసిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫ్లెక్సీకి దివ్యాంగులు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని పొట్టిశ్రీరాములు వి గ్రహం వద్ద మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫ్లెక్సీకి దివ్యాంగులు, టీడీపీ నేతలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు పూనూరి నరేంద్ర, దివ్యాంగుల సంఘం నేతలు ఘంటసాల శివరామకృష్ణ, కూకట్ల రమేష్, లక్ష్మారెడ్డి, ఎం. శ్రీనివాసరావు,పరిటాల నాగరాజు, బ్రహ్మం, జిలాని తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌ను పరామర్శించిన మంత్రులు

అద్దంకి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఫరూక్‌ను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు ఆదివారం పరామర్శించారు. ఫరూక్ సతీమణి షెహనాజ్ ఇటీవల మృతి చెందగా ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి ఫరూక్ ను పరామర్శించారు.

పద్యానికి పెద్ద దిక్కు 'చదలవాడ'

అద్దంకిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో పద్యానికి పునఃప్రతిష్ఠను తెచ్చే గొప్ప కర్తవ్యాన్ని చదలవాడ లక్ష్మీనరసింహారావు నిర్వహిస్తున్నారని, పద్యానికి పెద్ద దిక్కు చదలవాడ అని డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రంలో సాహితీ కౌముది ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారం-2025 ప్రదానోత్సవ కార్యక్రమం నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ చదలవాడ పద్య రచనలో గంభీరత, శాస్త్రీయ నిష్ఠ, సౌందర్యంతో పాటు పద్య ప్రక్రియను ప్రోత్సహించడంలో ఆయన అగ్రగామిగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా చదలవాడ లక్ష్మీనరసింహారావుకు సాహిత్య పురస్కారాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామమూర్తి, శైలజ దంపతులు, సాహితీ కౌముది సభ్యులు అందించి ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు వారణాసి రఘురామశర్మ, కార్యదర్శి కేవీ పోలిరెడ్డి, కడియం పాపారావు, కె. సుబ్బారావు, నాగేశ్వరరావు, రాజశేఖర్, చదలవాడ నృసింహ ప్రసాదు, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, దేవపాలన, వెంకట శివరామ ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, దివాకరదత్తు పాల్గొన్నారు.



చదలవాడ లక్ష్మీనరసింహారావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న సభ్యులు

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్న మినీ లారీ

మార్టూరు,మార్చి23(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో ఇసుకదర్శి ఫ్లైఓవర్ దిగువన ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి తిరుపతికి వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటన ఆదివారం వేకువజామున జరిగింది.ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న వి. గంగాధర్ తలకు తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తి పి. వేణుగోపాల్, లారీ డ్రైవరు ప్రభాకర్‌లకు గాయాలయ్యాయి. అయితే ముందు వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో సమీపంలోని హైవే అంబులెన్స్‌వారు, 108 వాహనం వారు, హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. గాయపడిన ముగ్గురిని అంబులెన్స్‌లో చిలకలూరిపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.అయితే లారీలో ప్రయాణిస్తున్న గంగాధర్‌ను,వేణుగోపాల్‌లను వారి కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం ఆదివారం ఉదయం చిలకలూరిపేట నుంచి విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ (ఇన్‌సెట్లో) గాయపడిన గంగాధర్

వయోజన అభ్యాసన మహిళలకు అర్హత పరీక్ష

పంగులూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉల్లాస్ కేంద్రాలలో గతవంద రోజులుగా చదువు నేర్చుకున్న వయోజన మహిళా అభ్యాసకులకు ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. 67 కేంద్రాలలో చదువు నేర్చుకున్న 670 మంది మహిళలకు ఈ పరీక్ష నిర్వహించారు. పంగులూరు, ముప్పవరం, జేవీపాలెం పరీక్షా కేంద్రాలను వయోజన విద్య జిల్లా కో ఆర్డినేటర్ మధు, నియోకవర్గ పర్యవేక్షకుడు పోతురాజు పరిశీలించారు.

పరీక్ష రాసిన 592 మంది వయోజనులు

అద్దంకిటౌన్ : మండలంలో మొత్తం 65 సెంటర్లలో 650 మందికి 592 మంది వయోజనులు హాజరై పరీక్ష రాశారని వెలుగు ఏపీఎం సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు.

చీరాలలో

చీరాల : ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని సుమారు 520 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు.

చినగంజాంలో

చినగంజాం: ఉల్లాస్-నవభారత సాక్షరతా కార్యక్రమంలో 680 మంది మహిళలు శిక్షణ పొందగా వారిలో 669 మంది పరీక్షకు హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

వాహనాలు ఢీ కొని భార్యాభర్తలకు గాయాలు

పంగులూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని భార్య, భర్తలు గాయపడిన ఘటన అలవలపాడు రోడ్డులో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన యోహోషోవా అనే వ్యక్తి తలకు తీవ్ర గాయం కాగా అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు మద్దిపాడు మండలంలో పొగాకు పనులకు వెళ్లిన తిమ్మసముద్రం గ్రామస్థులు ఆదివారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. వీరు అలవలపాడు వైపు వెలుతుండగా అదే రహదారిలో ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి వైపు వస్తున్న అద్దంకి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కిషోర్ ఎదురుగా వచ్చి వాహనాన్ని బలంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తలకు బలమైన గాయంతో అపస్మారక స్థితిలోకి పోయిన యోహోషోవాతో పాటు అతని భార్యను చికిత్స నిమిత్తం 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు.

న్యూస్ బాక్స్

1,243 మందికి వైద్య పరీక్షలు

వాడరేవు(చీరాల), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు రామానంద ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపు విజయవంతమైంది. వైద్యులు క్యాంపులో షుగరు. బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నెలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈక్రమంలో 1,243 మంది పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నట్లు ప్రతినిధులు సురేష్ తెలిపారు. అలాగే పరీక్షలకు వచ్చిన వారికి అల్పాహారం, తాగునీరు అందించి ఎండ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజరాజేశ్వరి, కమలా రాజేశ్వరి, లలిత్ ప్రకాష్, శ్రీకాంత్, ప్రకాష్, ట్రస్టు ప్రతినిధి కృష్ణారావు, వాడరేవు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సేవలు అందించారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు,మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఐకాన్ ఇండియా బిజినెస్ అవార్డు గ్రహీత అవిర్నేని శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా ఆదివారం విజయనగర్ కాలనీలోని వెంకయ్య ఆశ్రమంలో పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అంతేగాకుండా వారికి స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్, సతీష్, ఫణి, మణికంఠ, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు,మార్చి 22,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఆదివారం నేత్రదానం జరిగింది.గ్రామానికి చెందిన పొత్తూరి పూర్ణచంద్రరరావు మృతి చెందగా స్థానిక రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానంకు సహకరించిన మృతుని కుటుంబసభ్యులు అన్నపూర్ణ, ఉషారాణి, అంజనీ,కిషోర్, వాసుదేవరావులను అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి స్వామి, రోటరీ అధ్యక్షులు రఫీ,సభ్యులు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కుంకులమర్రు (పర్చూరు), మార్చి 23(ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం కుంకలమర్రులో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వీరిపై కేసునమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

ముక్తేశ్వరంలో సోలార్ మోటార్ల వైరు చోరీ

బల్లికురవ. మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతరావు అనే రైతుకు చెందిన పొలంలో ఉన్న సోలార్ మోటార్ల వైరును గుర్తు తెలియని దొంగలు శనివారం రాత్రి చోరీ చేశారు. ఆదివారం రైతు మోటార్లు ఆన్ చేసేందుకు వెళ్లగా కేబుల్ వైర్లు కట్ చేసి ఉన్నాయి. కేబుల్ వైర్లు లేక పంటకు నీటి ఇబ్బంది వచ్చిందని రైతు వాపోయారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

పంగులూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పంగులూరులో రక్షిత నీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ పథకం అమలులో భాగంగా చేపట్టిన నూతన విద్యుత్ లైన్ నిర్మాణ పనుల కారణంగా భూగర్భంలో నిర్మితమై ఉన్న నీటి పైపులు దెబ్బతిని గత కొద్ది రోజులుగా రక్షిత నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమస్యను గుర్తించిన అధికారులు పైప్‌లైన్‌కు తగిన మరమ్మతులు చేపట్టి ఆదివారం సాయంత్రం పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేశారు.

సమాజ సేవలోనే నిత్యానందం

వేటపాలెం(చీరాల), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలోనే నిత్యానందం ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రోటరీ కమ్యూనిటీ హాలును పునఃప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ రోటరీక్లబ్, ప్రోబస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హాలు పునఃప్రారంభమయినట్లు చెప్పారు. కార్యక్రమంలో గొల్లపూడి సీతారాం, శివరామకృష్ణ, కృష్ణమోహన్, ఆవుల పున్నయ్య పలువురు సభ్యులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం


బల్లికురవ. మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఎంపీపీ శ్రీలక్షి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్

అద్దంకిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులోనే స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.డి. గంగాధర్, కేపీరాజు, మందా జోసఫ్, రావులపల్లి కోటేశ్వరరావు, కేవీ శ్రీనివాసరావు, ఎస్కె కరీమ్, మున్సిపల్ వర్కర్స్ యునియన్ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

అద్దంకి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆదివారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కక్షలకు దూరంగా అందరూ శాంతియుతంగా మెలగాలన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. లోన్ యాప్‌లతో మోసపోవద్దన్నారు. కొత్త నెంబర్‌ల నుంచి ఫోన్‌లు వస్తే ఎట్టిపరిస్థితులలో ఓటీపీ లు చెప్పరాదన్నారు. గంజాయి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (సోమవారం సాయంత్రం)
సహరి : 4.54 (మంగళవారం ఉదయం)

'డీఆర్‌డీఏ'లో ఇంటి దొంగలు..!

- రాపూరు మండలంలో భారీగా నిధుల స్వాహా
- బోగస్ రుణాలు ఇచ్చి రూ.కోట్లు తినేసిన వైనం
- వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగిన బాగోతం
- కింది నుంచి పైస్థాయి వరకు పంపకాలు
- కలెక్టర్ ఆదేశాలతో అవినీతి బట్టబయలు
- థర్డ్ పార్టీ విచారణ చేస్తే వెలుగులోకి మరిన్ని అక్రమాలు

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చదువు రాని మహిళలు కదా..? మనమేం చేసినా వారికి ఏం తెలుస్తుందిలే అన్న ధైర్యం.. పేదల సొమ్మే కదా మనం తినేసినా ఎవరూ అడిగేవారు లేరులే అన్న బరితెగింపు.. వెరసి డీఆర్డీఏలో భారీ అవినీతి..! రాపూరు మండలంలో జరిగిన ఈ కుంభకోణం సంచలనంగా మారింది. రూ.వందలు, వేలు కాదు.. ఏకంగా రూ.కోట్లు ప్రజాధనాన్ని దిగమింగారు. ఈ కుంభకోణంలో కింది స్థాయి సీసీల నుంచి పైస్థాయి అధికారుల వరకు భాగస్వాములైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండడం కలకలం రేపుతోంది. పొదుపు సమాఖ్యల ద్వారా గ్రామీణ మహిళలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఉన్నత లక్ష్యం. అందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి రుణాలను మంజూరు చేస్తున్నది. అయితే ఈ సమాఖ్యలు అవినీతికి కేంద్రంగా మారుతున్నాయి. వీటిని పర్యవేక్షించే సీసీలు, ఏపీఎంల దగ్గర నుంచి డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే అధికారుల వరకూ ప్రతీ ఒక్కరూ ఈ అక్రమాలకు ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందిస్తుండడంతో ప్రభుత్వం లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. రాపూరు మండ లంలో ఉన్నతి, స్త్రీనిధి, సీఐఎఫ్ పథకాల కిందనున్న నిధులను దుర్వినియోగం చేశారు.



● బోగస్ రుణాలతో స్వాహా

ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్‌ప్లాన్ నిధులను రుణాలుగా మంజూరు చేశారు. అలానే స్త్రీనిధి పథకం కింద వడ్డీలేని రుణాలను ఇచ్చారు. అయితే పుస్తకాల్లో మాత్రం పలానా మహిళలకు రుణాలు ఇచ్చినట్లు రాసుకున్నారు తప్ప, వాస్తవానికి వారికి రుణాలు ఇవ్వలేదు. వారి పేరుతో బోగస్ రుణాలను మంజూరు చేసి డీఆర్‌డీఏ సిబ్బందినే ఆ నిధులను స్వాహా చేశారు. ఆఖరుకు యానాది సమాఖ్యను కూడా వదలకపోవడం గమనార్హం. యానాదులకు చెందాల్సిన నిధులను కూడా దిగమింగారు. చాలాకాలం నుంచి ఈ తంతు జరుగుతున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో అవినీతి పతాకస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి రాపూరులో తిష్ట వేసిన ఓ ఉద్యోగి ఈ అవినీతిలో కీలక పాత్రధారి అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంఘాల నిర్వహణకు ఇచ్చే సీఐఎఫ్ నిధులు కూడా మింగేసినట్లు సమాచారం. పుస్తకాల్లో లెక్కలు చూపిస్తున్నప్పటికీ అకౌంట్లలో మాత్రం డబ్బులు లేవని తెలుస్తోంది. ఏపీఎం, డీపీఎం, డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు అవినీతిపరులకు సహకరిస్తుండడంతో ఇంతకాలం ఈ భాగోతం వెలుగులోకి రాలేదు.

● కలెక్టర్ ఆదేశాలతో బట్టబయలు

రాపూరు మండలంలో పొదుపు సమాఖ్యల మాటున జరిగిన ఈ అవినీతి బాగోతం కలెక్టర్ ఆదేశాలతో బట్టబయలైంది. కొందరు స్థానికులు ఈ అవకతవకలపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. దీనిపై స్పందించిన కలెక్టర్.. గతేడాది నవంబరులో డీఆర్‌డీఏ పీడీను విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో తొమ్మిది మంది అధికారులు, ఉద్యోగులను ఒక విచారణ కమిటీగా పీడీ నియమించారు. ఈ కమిటీ మూడు నెలల పాటు విచారణ జరిపింది. ఈ విచారణలో అనేక అక్ర మాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ సొమ్మును వివిధ రూపాల్లో స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు. ఆ తర్వాత కలెక్టర్ నిర్ణయం కీలకం కానుంది.

● థర్డ్ పార్టీతోనే వాస్తవాలు వెలుగులోకి..!

ఒక్క రాపూరు మండలంలోనే సుమారు రూ.3 కోట్ల వరకూ నిధులను తినేసినట్లు ప్రచారం జరుగుతోంది. చాలా కాలం నుంచి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నా అధికారులెవరూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజాగా డీఆర్‌డీఏ పీడీ నియమించిన కమిటీ విచారణ జరిపినా ఇంకా అనేక వ్యవహారాలను గుర్తించలేదన్న ప్రచారం జరుగుతోంది. ఇక ఈ కమిటీ విచారణను చాలా ఆలస్యం చేయడం కూడా అనేక అనుమా నాలకు తావిస్తోంది. కలెక్టర్ కూడా పలుమార్లు నివేదిక గురించి అడిగితే తప్ప విచారణ పూర్తి చేయలేదని డీఆర్ డీఏ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ కమిటీలోని కొందరికి రాపూరులోని అవినీతితో పరోక్ష సంబంధం ఉందని, కాబట్టి వారి ద్వారా జరిపే విచారణ పారదర్శకంగా ఉండదని ఓ ఏపీఎం స్థాయి ఉద్యోగి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఏసీబీ చేత విచారణ జరిపించాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీతో విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవకతవకలు గుర్తించాం

రాపూరు మండలంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపాం. ప్రత్యేక కమిటీని నియమించి విచారణ పూర్తి చేశాం. నిధుల దుర్వినియోగానికి సంబంధించి అవకతవకలు జరిగాయని గుర్తించాం. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

ఇంటర్‌లో సమూల మార్పులు

- ఏప్రిల్ ఒకటి నుంచి ప్రథమ సంవత్సరం ప్రవేశాలు
- నూతన పద్ధతిలో తరగతుల నిర్వహణ
- జేఈఈ, ఎంసెట్‌పై ప్రత్యేక దృష్టి



నెల్లూరు(విద్య), మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన పద్ధతుల్లో తరగతుల నిర్వహణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ విద్యలో రెగ్యులర్ తరగతులతో పాటు జేఈఈ, ఎంసెట్‌లకు విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు. విద్యా ప్రమాణాల్లో మార్పులతో పాటు అడ్మిషన్ల సంఖ్యను పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచే తరగతులు ప్రారంభించనున్నారు.

● ఒకటి నుంచే విద్యాసంవత్సరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కొత్తబాట పట్టనుంది. ఇప్పటి వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిశాక ప్రభుత్వ కళాశాలలకు సెలవులు ఇచ్చి తిరిగి జూన్‌లో కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభించేవారు. సెలవుల్లో మాత్రం ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయేవి. చదువుల్లో సైతం వీరే ఆధిక్యాన్ని ప్రదర్శించడంతో ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడిపోయేవారు. ఈ విషయాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలతో ఈ ఏడాది మార్పులు, చేర్పులు చేస్తూ ఏప్రిల్ ఒకటి నుంచే కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభిస్తోంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించడంతో పాటు ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లను చేపట్టనున్నారు. టెన్త్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23వతేదీ వరకు తరగతులు, ప్రవేశాలు నిర్వహించి ఏప్రిల్ 24 నుంచి జూన్ 1వతేదీ వరకు సెలవులు ప్రకటిస్తారు. తిరిగి జూన్ 2 నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభం కానున్నాయి దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశంతో పాటు త్వరగా ప్రారంభించి తరగతులు నిర్వహించడంతో 15శాతం సిలబస్ కూడా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ సిలబస్ మొత్తం కూడా అక్టోబరు, నవంబరు నాటికి పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే సైన్స్ గ్రూప్ విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ అందించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్ శిక్షణ అందించనున్నారు.

● జిల్లాలో 71 ప్రభుత్వ కళాశాలలు

జిల్లాలో 24 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 11 మోడల్, 6 ఏపీఎస్‌డబ్ల్యూఆర్, 12 కేజీబీవీ, 16 హైస్కూల్ ప్లస్ కలిపి మొత్తం 71 ప్రభుత్వ కళాశాలలున్నాయి. వీటిల్లో సుమారు ఐదువేల మంది వరకు విద్యార్థులు చేరుతుంటారు. ఈ అడ్మిషన్ల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన పద్ధతులు అవలంబిస్తూ ఏప్రిల్ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. ఇందువల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రవేశాలు అనంతరం టెన్త్ ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్‌లో కొనసాగించి ఫెయిల్ అయిన వారిని తొలగిస్తామని ఆయన తెలిపారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలి

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరూ ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను సద్వినియోగం చేసుకుని, ఆత్మస్థైర్యంతో జీవించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులో ఆదివారం జరిగిన ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీలో వీపీఆర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు పలువురు దివ్యాంగుల చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే కోవూరు నియోజక వర్గంలో 250, ఉదయగిరిలో 150, కందుకూరులో 150, ఆత్మకూరులో 150 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల అందించామన్నారు. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లోనూ అందజేస్తామని తెలిపారు. ట్రై సైకిళ్లు అందుకున్న ప్రతి ఒక్కరి దగ్గరకి వెళ్లి పలకరించినప్పుడు కలిగిన ఆనందం, మధురానుభూతిగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచన, సంకల్పం కలుగుతుందన్నారు.

● సమష్టి కృషితో ఆత్మకూరు అభివృద్ధి : మంత్రి ఆనం

సమష్టి కృషితో ఆత్మకూరును అభివృద్ధి చేసి చూపుతామని, రానున్న మూడు నెలల్లో నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నామని దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని మైదానంలో నియోజకవర్గస్థాయి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగంలో ఐటీఐని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆత్మకూరులోని వంద పడకల ఆసుపసత్రిని విడతల వారీగా 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటికే ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని చెప్పారు. బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బీజేపీ సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంచర్ల శ్రీహరినాయుడు, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి తదితరులు పాల్గొన్నారు.

● వీపీఆర్ సేవలు స్ఫూర్తిదాయకం

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మనసున్న గొప్ప సేవాతత్పరుడని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కొనియాడారు. ఆదివారం ఉదయం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 60 లక్షల విలువ చేసే 150 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంటు చరిత్రలో సరికొత్త సువర్ణ అధ్యాయానికి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మంచి మనసున్న వీపీఆర్‌మన ఎంపీగా ఉండడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు.



దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

భూగర్భ డ్రైనేజీకి రూపాయి చెల్లిస్తే చాలు

నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ తీసుకున్న వారు రూపాయి మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఆదివారం నగరంలో పలు ప్రాంతాల్లోని పార్కులు, పాఠశాలలను ఆయన పరిశీలించారు. బోడిగాడుతోట వద్దనున్న సమాధుల తోటలో పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడే 200 మంది సామర్థ్యం కలిగిన కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మూలాపేటలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్కూలు మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగర కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రముగ్ధం విష్ణుదేవ గానం

- కొనసాగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలు



గాత్ర కచేరీ చేస్తున్న విష్ణుదేవ్ నంబూద్రి

నెల్లూరు (సాంస్కృతికం) ,మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పుర మందిరంలో జరుగుతున్న 60వ త్యాగరాజ స్మరణోత్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన కేఎస్ విష్ణుదేవ్ నంబూద్రి కచేరీ సంగీత ప్రియులను మంత్ర ముగ్ధులను చేసింది. ఆయన పలు కీర్తనలు ఆలపించి, చివరిగా శ్రీరంగనాథుని కొలుస్తూ శ్రీరంగపుర విహారా అనే కృతిని గానం చేసి భక్తులను పులకింపజేశారు. స్థానిక ఔత్సాహిక కళాకారులు ఉదయం 9 నుంచి రాత్రి 7గంటల వరకు త్యాగరాజస్వామి కృతులను ఆలపించారు. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారం, పూజలు జరిగాయి. కళాకారులను స్మరణోత్సవ సభ కార్యవర్గం సత్కరించింది.

'క్వార్ట్జ్' భోక్తల అరెస్టు ?

- పోలీసుల అదుపులో ముగ్గురు వైసీపీ నేతలు
- రుస్తుం మైన్స్ కేసులో విచారణ వేగవంతం

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో బరితెగించి క్వార్ట్జ్‌ను దోచుకున్న భోక్తల అరెస్టులు మొదలయ్యాయి. తొలుత రుస్తుం మైన్స్‌లో జరిగిన దోపిడీపై విచారణ ప్రారంభమైంది. ఈ కేసులో ముగ్గురు వైసీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పొదలకూరు మండలానికి చెందిన ఆ ముగ్గురు వ్యక్తులను నెల్లూరులో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో వీరి అరెస్టును చూపే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర కలకలాన్ని రేపుతోంది. ప్రస్తుతం రుస్తుం మైన్స్ కేసులో విచారణ వేగవంతంగా జరుగుతోంది. అదుపులో ఉన్న వ్యక్తులు ఇచ్చే సమాచారం ఆధారంగా మరికొంత మందిని కూడా అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2023 నవంబరు, డిసెంబరు నెలల్లో పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలో ఉన్న రుస్తుం మైన్స్‌లో కొందరు అక్రమార్కులు క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వి తరలించుకెళ్లారు. ఈ మైన్‌కు లీజు ముగియడంతో అది ప్రభుత్వ ఆధీనంలో ఉంది. రూ.కోట్ల విలువైన సరుకును కొల్లగొడుతుండడంతో ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాడు సత్యాగ్రహ దీక్ష చేశారు. అయినా ఒక్క అధికారి కూడా ఆ మైన్ వైపు కన్నెత్తి చూడలేదు. దాదాపు 40 లారీలు, ఎక్స్‌కవేటర్లను అప్పట్లో టీడీపీ నేతలు పట్టుకు న్నారు. క్వార్ట్జ్ తవ్వకాల కోసం ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను కూడా అక్కడ వినియో గించారు. ఒక లారీలో ఉన్న ఈ భారీ పేలుడు పదార్థాలను కూడా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రాష్ట్ర సీఎస్, డీజీపీ నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీ వరకూ అందరికీ సోమిరెడ్డి ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్ప డ్డాక క్వార్ట్జ్ అక్రమార్కుల లెక్క తేల్చే పని చేప ట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల మైనింగ్ డీడీ బాలాజీనాయక్ పొదలకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్‌ను తరలించుకెళ్లారని, వీరిపై చర్యలు తీసుకో వాలంటూ వైసీపీ నేతలు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై గత నెలలో పొదల కూరు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అప్పటి నుంచి లోతుగా విచారణ జరుపుతున్న పోలీసులు.. పక్కా ఆధారాలతో తాజాగా ముగ్గురు వైసీపీ నేతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సవాల్‌గా మారిన చోరీలు

- మెట్టలో వరుస దొంగతనాలు
- హడలుతున్న ప్రజలు
- నామమాత్రంగా గస్తీలు

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గంలో ఇటీవల చోరీలు అధికమ య్యాయి. తాళం వేసిన ఇళ్లు, ఆలయాలే లక్ష్యంగా చేసుకుని దొంగలు దోపిడీలకు తెగబడుతున్నారు. విలువైన బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు, వాహనాలను అపహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా నియోజక వర్గంలో ఏదో ఒకచోట ప్రతిరోజూ చోరీలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గంలోని సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో శివారునున్న ఆలయాల్లో చోరీలకు దుండగులు పాల్పడుతున్నారు. హుండీలను ధ్వంసం చేసి నగదు, బంగారు, వెండి నగలు దోచుకెళుతున్నారు. అంతేకాక నివాసాలు, బహిరంగ ప్రదేశాల్లో నిలిపిన మోటార్‌బైక్‌లను చోరీ చేస్తున్నారు. ఉదయగిరిలోని బాలాజీనగర్, కోళ్లవీధి, అగ్రహారం, బీసీ కాలనీలతోపాటు దుత్తలూరు, వరికుంటపాడు, వింజ మూరు, కొండాపురం, వింజమూరు మండలం నందిగుంట గ్రామాల్లో తాళాలు వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి భారీగా నగలు, నగదు అపహరించుకెళ్లారు. ఇటీ వల ఉదయగిరిలోని ఓ బంగారం దుకాణంలో మహిళలు నకిలీ బంగారాన్ని విక్రయించి రూ.2.50 లక్షల విలువైన అసలు బంగా రాన్ని దోచుకెళ్లారు. ఇవేకాక పోలీసుల దృష్టికి రాని చోరీలు ఇంకా అనేకం ఉన్నాయి.



● నామమాత్రంగా గస్తీ

పోలీసులు రాత్రి గస్తీ నామమాత్రంగానే సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం వాహనానికి సైరన్ వేసుకొని ప్రధాన రహదారులపై వెళుతూ బీట్ పాయింట్లను మాత్రమే సందర్శించి వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఐడీ పార్టీ ఉందా, చోరీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తిస్తున్నారా ? అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్థానికుల సహాయంతో పట్టణాలు వదిలి, పల్లెప్రాంతాలపై కన్నేసి తరుచూ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనికితోడు నియోజక వర్గంలో ఇటీవల జాతీయ రహదారుల నిర్మాణం జరగడంతో దొంగల రాకపోకలకు అనువుగా ఉందని చెప్పుకోవాలి. అయితే పోలీసులు ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, చోరీలపై అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో సమాచారం అందివ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా దొంగలు వారి పని వారు చేసుకుపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి, నివారించాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరిలో నకిలీ బంగారం ఇచ్చి ఒరిజనల్ బంగారు తీసుకెళ్లిన మహిళలు(ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
కోడిగుడ్ల ధర (100) : 470	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 100000
వెండి ఒక గ్రాము	రూ.103.00

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున కందుకూరు సబ్ డివిజన్‌లో బెట్టింగ్‌లపై నిఘాపెట్టామని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన పాతనేరస్తుల వివరాలను సేకరించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంపులు గుంపులుగా కూర్చుని సెల్‌ఫోన్‌లు చూస్తూ బెట్టింగ్‌లు వేస్తున్నా గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

నాగవరపమ్మకు శాంతి హోమం

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న నాగవరపమ్మకు ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. ఉదయం వెండి నాగేంద్రస్వామి, అమ్మవారి విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొలుపు కార్యక్రమం జరిగింది.

పేదలకు వైద్య పరీక్షలు

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల ఎస్సీ కాలనీలో ఆదివారం డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూరాలజీ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. పేదలకు హైపర్‌టెన్షన్, డయాబెటిస్, మతిస్థిమితం (ఎపిలెప్సీ), స్ట్రోక్, నూరాలజికల్ వ్యాధుల డాక్టర్ బిందుమీనన్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ వార్షికోత్సవం

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో బాలికల హాస్టల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలికల హాస్టల్‌లో ఇంజనీరింగ్, డిప్లమో, డిగ్రీ నర్సింగ్ విద్యార్థినులు వార్షికోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్‌లను విద్యార్థులు సత్కరించారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

లింగసముద్రం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం నారాయణ చెప్పారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు, మద్యం అక్రమ రవాణా, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మజ్జిగ, పండ్లు పంపిణీ

కందుకూరు(ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంకమ్మ దేవాలయం వద్ద నిరుపేదలు, యాచకులకు ఆదివారం మజ్జిగ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవ, పీ.ప్రభాకర్, కే.కిషోర్, జీ.చిన అల్లూరయ్య, జీ.రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు నిర్వహించి పొం గళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

అనంతసాగరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద మసీదులో ముస్లింలకు మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. కార్య క్రమంలో ఉత్తర కాలువ చెర్మన్ మెటు కూరు కృష్ణారెడ్డి, సోమశిల డ్యాం చెర్మన్ వీ కేశవచౌదరి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాఘూరు సుబ్బారెడ్డి, ఖాసీం బా షా, అవినాష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో వైఎస్ఆర్ ఇన్ఫోటెక్, ఆల్‌ట్రస్ట్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కావలి రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బుడంగుంటలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1990-91లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం బుడంగుంటలో జరిగింది. చౌదరిపాలెంకు చెందిన పూర్వ విద్యార్థి కోడెల క్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు కావలి దేవదానం, జి.దయాకర్‌తోపాటు ప్రస్తుత ఉపాధ్యాయులు ఐహెచ్ఎల్. ప్రసాద్, జేవీ.రామారావులను శాలువాలతో సన్మానించారు. ఈ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థుల యూనీఫాం కుట్టుకూలికి రూ.8000 అందజేశారు.

ఎంఐజీ లేఅవుట్‌లో ధర తగ్గింపునకు చర్యలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని జీప్లస్ త్రీ గృహ సముదాయాల సమీపంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్ల ధర ఎక్కువగా ఉన్నందున వాటిని సవరించాలని మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణకు విజ్ఞప్తిచేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి లే అవుట్‌ను అభివృద్ధి చేసినా ఆప్రాంతంలో లేని ధరలు పెట్టడంతో కొనుగోలుదారులు ముందుకు రాని పరిస్థితి ఉందని, దీంతో ఇతర మున్సిపాలిటీల లో పెట్టిన ధరలను పరిశీలించి తదనుగుణంగా తగ్గించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే ఈమేరకు ధరలు తగ్గిస్తూ ఆమోదం రానుందని మరోసారి ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్లు విక్రయానికి చర్యలు ప్రారంభిస్తామని వివరించారు. ప్రజలకు తక్కువ ధరకే నివాస స్థలాలు అందేలా చూడాలన్న లక్ష్యంతో ఈ ప్లాట్లు విక్రయించనున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కో సం పామూరు రోడ్డు సర్కిల్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఏరియా ఆసుపత్రి వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఓవీ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి మహదేవపురం రోడ్డు సర్కిల్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా 20 మందికి రూ.20.5 లక్షలు సీఎం సహాయనిధి మంజూరైనట్లు తెలిపారు.



ఉలవపాడు : టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారితో ఎమ్మెల్యే ఇంటూరి

టీడీపీలో వైసీపీ నేతల చేరిక

ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని వాక గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం కందుకూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన పొడమేకల చెంచయ్య, తిరుపతి, రమేష్, సుబ్బయ్య, బూచి మల్లికార్జున, సన్నిబోయి బాలయ్య, పొడమేలక కృష్ణ తదితరులకు ఎమ్మెల్యే పసుపు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పార్టీలోని పాత, కొత్త నాయకత్వం సమన్వయంతో పార్టీ బలోపేతానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, వాయల శ్రీను, పాదాల మురళీకృష్ణ, టీ శ్రీకాంత్, పీ సుబ్రహ్మణ్యం, పాదాల జాలిరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతికి ఘన స్వాగతం

ఉలవపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు పాడి పంటలు, వ్యాపారాలతో సుభిక్షంగా ఉండాలని, హిందూ ధర్మ పరిరక్షణ కోసం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) తెనాలి సాలిగ్రామ మంఠం ట్రస్ట్ నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉలవపాడుకు చేరింది. ఈ పాదయాత్ర ఉలవపాడు జాతీయ రహదారి వద్దకు చేరుకోగా మండల ఆర్యవైశ్యులు బాలస్వామీజీకి, శిష్యబృందానికి మంగళవాయిద్యాలతో, గోవింద నామస్మరణతో ఘన స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు. ఉలవపాడులో నూతనంగా నిర్మించబోయే వాసవీ కన్యకాపరమేశ్వరి ఆయల నిర్మాణ స్థలాన్ని స్వామివారు పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, శివకుమార్, సత్యనారాయణ, అయ్యప్ప, శ్రీనివాసులు, గంగాధర్, హనుమంతరావు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



బాలస్వామీజీకి ఘన స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్యులు

నేడు కావలికి..

కావలి(ఆంధ్రజ్యోతి): పెనుగొండక్షేత్రం పీఠాధిపతి బాలస్వామీజీ సోమవారం కావలి పట్టణానికి వస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం కావలి ప్రెసిడెంట్ తటవర్తి రమేష్ తెలిపారు. కావలి పట్టణంలోని సబ్‌కోర్టువీధిలోని కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఆర్యవైశ్య సంఘ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రదానంగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతికి స్వాగత ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. సాయంత్రం బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పీఠాధిపతిచే శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రామక్రిష్ణ, నేతలు మొగళ్లపల్లి రాజ, యేల్చూరు రవి, వైభవ సురేష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

జెండా చెట్టు సెంటర్ మసీద్‌లో ఇఫ్తార్ విందు



ముస్లింలను అలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని జెండా చెట్టు సెంటర్ మసీద్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని ముస్లింలకు స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన కావలి నియోజకవర్గంలోని ముస్లింలందరికీ ముసునూరులోని తన ఇంటి వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ముస్లింలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత మహేంద్రకు ఎమ్మెల్యే అభినందన

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన ఏపీ తెలుగునాడు ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలలో టీఎన్‌టీయూసీ కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి మహేంద్రకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆ అవార్డుతో మహేంద్రను అభినందించారు. అనంతరం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంత తీసుకుంటున్న మండలంలోని చలంచర్ల టీడీపీ సీనియర్ నాయకుడు చాగంటి వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే పరామర్శించారు.

ముగిసిన జాతీయస్థాయి డబుల్స్ టెన్నిస్ పోటీలు

కావలిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కావలిలో రెండు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి డబుల్స్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. అనంతరం అఫిషియల్ క్లబ్ కోర్టు టోర్నమెంట్ కమి టీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఏఎస్పీ నాగేశ్వరరావు, జీవీకె గ్రూప్ అడ్వయిజర్ ఆదిశేషారెడ్డిలు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ కార్యదర్శి వంశీ మోహన్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

● 30 ప్లస్‌లో విన్నర్‌గా కావలి జట్టు, రన్నర్‌గా హైద్రాబాద్ జట్టు, 40ప్లస్‌లో విన్నర్‌గా కావలి, రన్నర్‌గా విజయవాడ, 60 ప్లస్‌లో విన్నర్‌గా హైద్రాబాద్, రన్నర్‌గా కర్నాటక, 70 ప్లస్‌లో విన్నర్, రన్నర్‌గా హైద్రాబాద్ జట్లు నిలిచారు.



విజేతకు కప్పు అందజేస్తున్న నిర్వాహకులు

భగత్‌సింగ్ దేశభక్తి యువతకు స్ఫూర్తి

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ దేశభక్తిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలు ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక జనతాపేటలోని భగత్‌సింగ్ విగ్రహానికి పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘ నేత తాళ్లూరు మాల్యాద్రి, జిల్లా రైతు సంఘం నేత దర్గాబాబు, సీపీఐ సహాయ కార్యదర్శి బోసు, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పొబ్బా సాయి, ఏటూరు శివ, జనసేన నేతలు తిరుమలశెట్టి సుధీర్, నాగార్జునలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమంలో వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు సుందర్, రాజకుమార్, టీ.పోతురాజు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.సురేష్‌బాబు, వై.ఆనంద్ మోహన్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మచారి, బ్రహ్మయ్య, నాగరాజు, జాషువా సేవాసంస్థ వ్యవస్థాపకుడు ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పరిశీలన

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను, అలిచర్ల బంగారు పాలెం ప్రాంతంలో పెంచుతున్న (మడ్‌క్రాబ్) భారీ పీతలను ఏపీ ఫిషరీస్ కమిషనర్ రామాశంకర్ నాయక్ ఆదివారం సాయత్రం పరిశీలించారు. అనంతరం ఫిషింగ్ హార్బర్ పరిస్థితిని జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న చెన్నై, కడలూరు, కారైకల్ హైస్పీడ్ బోట్లపై ఆరా తీశారు. అనుమతి లేకుండా అక్రమంగా సముద్ర చేపల వేట సాగిస్తున్న వారిపై ఎఫ్‌డీవోలకు తెలియజేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు ఎఫ్‌డీవోలు సంజయ్, శ్రీనివాసులు, స్టీఫెన్, రవికుమార్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల సావరంపై ఎస్సై భోజ్యా తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● ఉలవపాడు(ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల గ్రామం శివారుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచాంతో కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై అంకమ్మ, సిబ్బంది దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులతోపాటు రెండు బైకులు, రెండు పందెం కోళ్లు, రూ.4980 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పేద వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని డీఆర్ విశ్వోదయ సేవాసమితి కార్యాలయంలో ఆదివారం డీఆర్ కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డిలు 60 మంది పేదవృద్ధులకు రూ.60 వేల విలువైన నిత్యావసరాలతోపాటు కొంత నగదు అందజేశారు. విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, కే.తాతిరెడ్డి, డాక్టర్ మౌలాలి, దిల్షాద్ బేగం, సావన్, నల్లూరు రామక్రిష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 53 కోట్లతో ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి

● దేవదాయ శాఖా మంత్రి ఆనం

ఆత్మకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ శాఖ నుంచి ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 53 కోట్లు మంజూరయ్యాయని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీకి రింగు రోడ్డు నిర్మాణం, ఇంజనీరింగ్ కాలేజీ మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు ఇందూరు వెంకటరమణారెడ్డి, చంద్రా వెంకటసుబ్బానాయుడు, టీపీపీ నేతలు దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, గాలిబోయిన లక్ష్మనరసయ్య, వివిధ మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తదితరులు

బ్లడ్ బ్యాంకు ప్రారంభం

అనంతరం మంత్రి ఆనం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో మౌలికవసతులు, వైద్యపరికరాల ఏర్పాటు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అభివృద్ధి కమిటీ సమావేశంలో సమీక్షించారు. ముందుగా ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు మంజూరైన బ్లడ్ బ్యాంకును, వైద్యశాల సమీపంలో పోలీసుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఈవోపీఆర్డీ

సీతారామపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భా గంగా మండల కేంద్రంలోని బె స్తకాలనీలో ఈవోపీఆర్డీ భార్గవి ఆధ్వర్యంలో ఆదివారం పారి శుధ్య కార్యక్రమం నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామస్థులు చెత్తను రోడ్లమీద కాని, బహిరంగ ప్రదేశాలు, డ్రైనేజీలో వేయరాదని, అతిక్రమించిన వారికి గ్రామ పంచాయతీచే జరిమానా విధించ బడుతుందన్నారు. ఇంటిలోని తడి చెత్త, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని సూచించారు. అనంతరం ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.



చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

సోమశిలలో 54.343 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 54.343 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



వింజమూరు : బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందచేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స కోసం తమ సొంత నిధులను ఖర్చు చేసుకున్న 78 మందికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంజూరు చేసిన సుమారు రూ.కోటి చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ పి చెంచల బాబుయాదవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రంగారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

పట్టణంలోని ప్రసన్నరెడ్డినగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో కంచికామకోటి మెడికల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి గుంటూరు వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే కాకర్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెంకు చెందిన కొమ్మి బసవయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన కుమారుడికి రూ.1.06 లక్షలు, అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన బోనముక్కల సుబ్బారెడ్డికి రూ.1.65 లక్షలు, మరో 9 మందికి రూ.13.75 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేశారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వయోజనులకు ఆదివారం ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏపీఎం ఖాజారంతుల్లా తెలిపారు. 19 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించగా 331 మంది వయోజనులకు గాను 329 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈపరీక్షను వయోజన విద్య పర్యవేక్షకుడు షేక్ బాదుల్లా పర్యవేక్షించారు.



ఆంధ్రావారిపల్లెలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం సుధాకర్

●దుత్తలూరు: మండలంలోని చింతలకుంటలో ఆదివారం వయోజనులకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను ఎంపీడీవో మల్లికార్జున్ పరిశీలించారు. వయోజనులను అక్షరాస్యులగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈపరీక్షలు నిర్వహిస్తోందన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): మండలంలోని వరికుంటపాడు, ఆంధ్రావారిపల్లి కేంద్రాల్లో వయోజనులకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను ఏపీఎం సుధాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వయోజనులంతా అక్షరాస్యులుగా మారాలన్నారు.

అంకమ్మకు వైభవంగా పాలపొంగళ్లు

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కందుకూరు అంకమ్మ ఆలయంలో పాల పొంగళ్ల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు చద్దులు, వడపప్పు, పానకం సమర్పించే కార్యక్రమం నిర్వహించగా ముగింపుగా అంకమ్మకు పాలపొంగళ్లు సమర్పించారు. గ్రామదేవతల ధర్మకర్త దివి లింగయ్యనాయుడు, ఇతర గ్రామపెద్దలు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరవటంతో ఆలయంలో కోలాహలం నెలకొంది. పాలపొంగళ్లు సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచే తరలిరావటంతో ఆలయ అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేయగా సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగింది.



అంకమ్మ ఆలయం వద్ద మహిళా భక్తుల బారులు